# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 181 | విశాఖపట్నం | 2-4-2026 గురువారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 181 | VISAKHAPATNAM | 2-4-2026 THURSDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram




## అమరావతికి చట్టబద్ధత బిల్లుకు
# లోక్‌సభ ఆమోదం
### నేడు రాజ్యసభకు.. రాష్ట్రపతి ఆమోదం తర్వాత గెజిట్

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఆంధ్రుల కల అయిన రాజధాని అమరావతికి చట్టబద్ధ హామీలో కీలక ముందడుగు పడింది. ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు బుధవారం పార్లమెంట్ ముందుకు వచ్చింది. 2024 జూన్ 2 నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ విభజన చట్టం- 2014లోని సెక్షన్ 5(2)కి సవరణ చేస్తూ కేంద్ర హోం శాఖ రూపొందించిన బిల్లును ఆ శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. సుమారు 2 గంటలపాటు చర్చ తర్వాత అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్, వైఎస్సార్సీపీ, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. ఆ తర్వాత కేంద్ర కేబినెట్ పోస్ట్ ఫ్యాక్టో ర్యాటిఫికేషన్ చేసి అనంతరం రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి ఆమోదం అనంతరం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. అమరావతిని శాశ్వత రాజధానిగా ఉంచాలి: ఏపీ రాజధానిగా అమరావతి శాశ్వతంగా ఉంటుందా అన్న అనుమానానికి ఈ చట్టసవరణ ముగింపు పలుకుతుందని బిల్లుపై చర్చలో ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. అమరావతికి చట్టబద్ధత ఇచ్చేందుకు అంగీకరించిన ప్రధాని మోదీకి, అమిత్‌షాకు కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి అనేది చంద్రబాబు ఆశయం, కల, ధ్యేయమని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కూటమి ఐక్యతకు కంకణబద్ధుడైన వ్యక్తి పవన్‌కల్యాణ్ అని కొనియాడారు. జగన్ అణచివేత వల్లే అమరావతి ఒక ఉద్యమంగా మారి దేశాన్ని ఆకర్షించిందని పెమ్మసాని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో రాజధాని కీలక పాత్ర పోషిస్తుందని, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్



ఆయా రాష్ట్రాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. అమరావతి ఏపీ ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజధాని నిర్ణయం, మార్పు కేంద్రం పరిధిలోనే ఉంటుందని 2022లో సుప్రీంకోర్టు చెప్పిందని పెమ్మసాని చంద్రశేఖర్ పునరుద్ఘాటించారు. (తరువాయి 2వ పేజీలో)



2లో

విద్యుత్ స్తంభాలు
### పడిపోతున్నా.. పట్టించుకోరా?



2లో

### కిడ్నీ రాకెట్ గుట్టురట్టు..
ఐదుగురు డాక్టర్లు అరెస్టు



6లో

### మెనోపాజ్ తర్వాత సమస్యలు రాకుండా ఉండాలంటే ..!

## అమరావతిని ఎవరూ టచ్
# చేయలేరు: చంద్రబాబు



**నెల్లూరు, పతాకం న్యూస్:** అమరావతికి చట్టబద్ధత బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడం ఒక చరిత్ర అని సీఎం చంద్రబాబు అన్నారు. రాబోయే రోజుల్లో అమరావతిని ఎవరూ టచ్ చేయలేరన్నారు. ఏపీకి ఏకైక రాజధానిగా అమరావతి ఉంటుందని సీఎం పేర్కొన్నారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నెల్లూరు జిల్లా వింజమూరులో పర్యటించారు. లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. సందర్భంగా వైసీపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'నా జీవితంలో (తరువాయి 2వ పేజీలో)

## అమరావతిపై చంద్రబాబు
# డ్రామా: జగన్



**తాడేపల్లి, పతాకం న్యూస్:** అమరావతి రాజధాని నిర్మాణంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమరావతిని రూ.2 లక్షల కోట్ల భారీ ఆర్థిక కుంభకోణంగా అభివర్ణించిన ఆయన, దీనికి ప్రత్యామ్నాయంగా 'ప్లాన్ బి' పేరుతో 'మావిగన్' అనే కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుతూ ఈ రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి (తరువాయి 2వ పేజీలో)


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

ధర్మం కోసం
పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను
బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు
సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH


## ఉచిత విద్యుత్ పథకంతో నేతన్నలకు ఆర్థిక భరోసా: కొల్లు

**కృష్ణా, పతాకం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత విద్యుత్ పథకం నేతన్నల ఆర్థిక భరోసాకు ఎంతగానో దోహద పడుతుందని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం మంత్రి ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణలతో కలిసి నగరంలోని 29వ డివిజన్ చింతగుంటపాలెంలో పర్యటించి ఐదుగురు చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించే ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మంత్రి మగ్గం గుంతలో కూర్చుని మగ్గం నేశారు. మంత్రికొల్లు మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకాన్ని బుధవారం నుండి సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించడం జరిగిందన్నారు.



# కాంగ్రెస్‌పై ప్రధాని మోడీ ఫైర్



**అస్సాం, పతాకం న్యూస్:** కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోడీ ఫైర్ అయ్యారు. బుధవారం అస్సాంలో ధేమాజీ జిల్లాలోని గోగాముఖలో జరిగిన ఎన్నికల ర్యాలీలో మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మెజారిటీ వర్గాన్ని మైనారిటీగా మార్చి, చొరబాటుదారుల శాశ్వత ఓటు బ్యాంకును సృష్టించడమే కాంగ్రెస్ లక్ష్యం' అని ఆయన అన్నారు. అస్సాంలో చొరబాటుదారులకు రక్షణ కల్పించేందుకు కొత్త చట్టం తీసుకువస్తామని కాంగ్రెస్ నేతలు బహిరంగంగా చెబుతూ, వారికి మద్దతు ఇస్తున్నారు అని ప్రధాని ఆరోపించారు. దేశ విభజన సమయంలో ముస్లిం లీగ్ చేసిన విధంగానే, ఆ పురాతన పార్టీ కూడా దేశాన్ని విభజించడానికి ప్రయత్నిస్తోందన్నారు.

## ఏపీ ఎంపీలపై
# షర్మిల ఫైర్



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఎంపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రానికి జీవన్మరణ సమస్య అయిన ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనలో ఎంపీలు పూర్తిగా విఫలమయ్యారని, వారు ప్రధాని మోదీ చేతిలో కీలుబొమ్మలుగా, బీజేపీకి బానిసలుగా మారారని ఆమె తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలి, స్వలాభం కోసం పనిచేస్తున్న ఎంపీలంతా తమ పదవులకు తక్షణమే రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. లోక్ సభలో అమరావతి చట్టబద్ధత బిల్లును కేంద్రం ప్రవేశపెట్టడం తెలిసిందే. దీనిపై జరిగిన చర్చలో (తరువాయి 4వ పేజీలో)

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## హక్కులు?

ఆటిజం అనేది జీవితాంతం ఉండే ఒక నాడీ సంబంధిత రుగ్మత. పిల్లల్లో మొదటి మూడేళ్ల లోపు ఆటిజం సంభవిస్తుంది. ఈ సమస్యతో బాధపడుతున్న పిల్లలు ఎదుర్కొనే సమస్యలను అర్థం చేసుకోవడం చాలా క్లిష్టమైన అంశం. సామాజిక భద్రతతో పాటు పిల్లలకు భద్రత, గౌరవం, సమాన అవకాశాలను కల్పించడం తల్లిదండ్రులకు చాలా కష్టంతో కూడుకున్న విషయం. ఆటిజంను 'ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్' అని పిలుస్తారు. మొదటగా పిల్లలు సాధారణంగానే కనిపిస్తున్నప్పటికీ క్రమేణా సామాజిక, భాషా నైపుణ్యాలను కోల్పోవడం వలన ఈ వ్యాధి లక్షణాలు తీవ్రంగా మారతాయి. 18 నెలల వయస్సు ఉన్నప్పుడు పిల్లల్లో కనిపిస్తున్న లోపాలను గుర్తించడం జరుగుతుంది. ఆటిజం వేగంగా విస్తరిస్తుంది. ఆటిజం కలిగిన పిల్లల సామర్థ్యాలు, అవసరాలు మారుతూ కాలక్రమేణా పెరుగుతాయి. ఈ రుగ్మత కలిగిన వారిలో కొద్దిమంది స్వతంత్రంగా జీవించగలు గుతున్నప్పటికీ మరి కొంతమంది తీవ్రమైన వైకల్యానికి గురవుతారు. ఆటిజం చదువుతోపాటు ఉపాధి అవకాశాలపై ప్రభావం చూపుతుంది. పర్యావరణంలో వస్తున్న మార్పులు ఆటిజం కలిగిన చిన్నారులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అనేక అధ్యయన నివేదికలు వెల్లడిస్తున్నాయి. తల్లిదండ్రులు తక్కువ వయస్సు కలిగి ఉండడం, గర్భధారణ సమయంలో వాయు కాలుష్యానికి గురికావడం, నెలలు నిండక ముందే పిల్లలు పుట్టడం, తక్కువ బరువుతో పిల్లలు పుట్టడం వంటివి ఆటిజం పెరుగుదలకు కారణమవుతున్నాయి. ప్రపంచ జనాభాలో 1 శాతం మందికి ఆటిజం రుగ్మత ఉంది. 2023లో యునైటెడ్ స్టేట్స్ లోని ప్రతి 36 మంది పిల్లల్లో 1 శాతం మంది ఆటిజంతో బాధపడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 2000 సంవత్సరం నుండి 2023 నాటికి 178 శాతానికి పెరిగింది. గత పదేళ్ల కాలంలో 7,07,000 నుండి 1,11,6000 మందికి పాఠశాలల్లో ఆటిజం రుగ్మతకు అవసరమైన సేవలు లభించడం లేదు. ఆటిజం కలిగిన పెద్దల్లో 75 శాతం మందికి ఉపాధి లభించడం లేదు. 25 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుల్లో 50 శాతం మంది ఉద్యోగం చేయలేకపోతున్నారు. ఆటిజం కలిగిన వారిలో 40 శాతం మంది శబ్దం వినలేక పోతున్నారు. 78 శాతం మంది పిల్లలు మరొక మానసిక ఆరోగ్య రుగ్మత కలిగి ఉంటున్నారు. 80 శాతం మంది ఆటిజం కలిగిన పిల్లలు నడవలేకపోతున్నారు. రాయలేకపోతున్నారు. మన దేశంలో ప్రస్తుతం 1 కోటి 80 లక్షల మంది ఆటిజంతో బాధపడుతున్నారని అంచనా. దేశంలో ప్రతి 66 మంది పిల్లలలో ఒకరికి ఆటిజం సమస్య ఉంది. ఆటిజం సమస్య కలిగిన పిల్లల్లో 40 శాతం మంది పిల్లలు మాట్లాడలేక పోతున్నారు. ఆటిజం అమ్మాయిల కంటే అబ్బాయిల్లో 4 రెట్లు ఎక్కువగా నిర్ధారణ అవుతున్నదని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఆటిజం ఉన్న పెద్దల్లో 40 శాతం మంది జీతం పొందే ఉద్యోగాలు చేయలేక పోతున్నారు. ఈ సమస్య వున్న వారిలో మూడింట ఒక వంతు మందికి ఆందోళన ఉంటుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ఆటిజంను కూడా అంగవైకల్యంగా గుర్తించింది. కానీ నేటికీ వారికి వైకల్య ధృవీకరణ పత్రాలు ఇవ్వడం లేదు. ఆటిజం, సెరిబ్రల్ పాల్సి, మానసిక వికలాంగుల సంక్షేమం కోసం...నేషనల్ ట్రస్ట్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. ఈ రుగ్మత కలిగిన వారికి ప్రత్యేక పాఠశాలలు, సౌకర్యాలు కల్పించాలి. ఆటిజం సమస్య కలిగిన పిల్లలకు ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయాలి. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించాలి. పుట్టిన పిల్లల్లో శారీరక, మానసిక వైకల్యాల లోపాలను గుర్తించి వాటిని నివారించడానికి ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉంది. ఆటిజం ఉన్న వారితో సహా ప్రజలందరికీ అత్యున్నత స్థాయి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందే హక్కు ఉంది. అయినప్పటికీ, ఆటిజం ఉన్న వారు తరచుగా వివక్షకు గురవుతారు. మరీ ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ, విద్యకు సంబంధించి సమాన అవకాశాలను అన్యాయంగా నిరాకరించడం జరుగుతున్నది. ఆటిజం ఉన్నవారికి సాధారణ జనాభాకు ఉండే ఆరోగ్య సమస్యలే ఉంటాయి. అయితే, వీరికి అదనంగా, ఇతర ఆరోగ్య సమస్యలకు సంబంధించిన ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ అవసరాలు ఉండవచ్చు. సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం వంటి ప్రవర్తనాపరమైన కారణాల వల్ల, వారు దీర్ఘకాలిక అంటువ్యాధులు, వ్యాధుల బారిన పడటానికి అవకాశం ఎక్కువ. అలాగే వారు హింసకు గురయ్యే, గాయాలపాలయ్యే ప్రమాదం కూడా ఎక్కువ. ఆటిజం ఉన్నవారు అకాల మరణం చెందే అవకాశం అధికం.

### విద్యుత్ స్తంభాలు

## పడిపోతున్నా.. పట్టించుకోరా?



**కర్నూలు, పతాకం న్యూస్:** కొలిమిగుండ్ల మండలంలోని మీర్జాపురం గ్రామంలో విద్యుత్ స్తంభాలు శిథిలమై పడిపోతున్నాయి. స్తంభాలు పొలాల్లో కూలిపోతుండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. కొలిమిగుండ్ల సబ్‌స్టేషన్ నుంచి, పొలాల్లో విద్యుత్ లైను ఏర్పాటు చేశారు. అయితే సుమారు 6కు పైగా స్థంభాలు ఒరిగిపోయాయి. ఎప్పుడేం జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు చోటుచేసుకోకముందే విద్యుత్ అధికారులు స్పందించి, స్తంభాలను సరిచేయాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

## ముగ్గురు మహిళలపై దుండగుడు కత్తితో దాడి



**కర్నూలు, పతాకం న్యూస్:** ఓ దుండగుడు ముగ్గురు మహిళలపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన బుధవారం చిత్తూరు జిల్లాలో జరిగింది. చిత్తూరు విద్యుత్ శాఖ కార్యాలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనా స్థలానికి పోలీసులు గుర్తించారు. దాడికి పాల్పడిన వ్యక్తి వి.భాస్కర్ నాయుడుగా గుర్తించారు. సరస్వతీ, సులోచనలు తీవ్రంగా గాయపడ్డారు. లక్ష్మీకి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## దేశమంతటా యూపీఐ సేవలు డౌన్.. యూజర్ల అసహనం!

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా నేడు డిజిటల్ చెల్లింపు సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. యూపీఐ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా లావాదేవీలు చేసేందుకు ప్రయత్నించిన అనేకమంది వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సేవల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపించింది. ఔటేజ్ ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్‌డిటెక్టర్ ప్రకారం, ఒక్కసారిగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఒక్క ఎస్‌బీఐ ఖాతాదారుల నుంచే 500కు పైగా ఔటేజ్ రిపోర్టులు రాగా, యూకో బ్యాంకుకు సంబంధించి దాదాపు 40 ఫిర్యాదులు నమోదయ్యాయి. 1

(మొదటిపేజీ తరువాయి)

## డ్రామా: జగన్

చేయవచ్చని ఆయన సూచించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. జగన్ వివరించిన 'మావిగన్' ప్రణాళిక ప్రకారం, మచిలీపట్నం నుంచి విజయవాడ (70 కి.మీ.), విజయవాడ నుంచి గుంటూరు (40 కి.మీ.) వరకు విస్తరించి ఉన్న 110 కిలోమీటర్ల కారిడార్‌ను రాజధాని ప్రాంతంగా ప్రకటించాలి. ఈ ప్రాంతంలో ఇప్పటికే 35–40 లక్షల జనాభా నివసిస్తోందని, జాతీయ రహదారి వంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయని జగన్ గుర్తుచేశారు. అమరావతికి ప్రతిపాదించిన రూ.2 లక్షల కోట్లలో కేవలం 10% నిధులు, అంటే రూ.20,000 కోట్లతో ఈ ప్రాంతంలో రింగ్ రోడ్లు, ఇతర అనుసంధాన మార్గాలు ఏర్పాటు చేస్తే, ఇది సహజంగానే ఒక మెగాసిటీగా, అభివృద్ధి కేంద్రంగా మారుతుందని ఆయన వివరించారు. తన హయాంలో మచిలీపట్నం పోర్టు పనులు ప్రారంభించామని, దానివల్ల ఈ ప్రాంతానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన ఈ ప్రాంతంలో అవినీతికి ఆస్కారం తక్కువ కాబట్టే, ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రణాళికను పక్కన పెట్టిందని ఆరోపించారు. అమరావతిని 'అవినీతి రాజధాని'గా జగన్ అభివర్ణించారు. చంద్రబాబు ప్రభుత్వమే కేంద్రానికి, బ్యాంకులకు ఇచ్చిన లెక్కల ప్రకారం, అమరావతిలో కేవలం రోడ్లు, కరెంట్, డ్రైనేజీ వంటి కనీస వసతులకే ఎకరానికి రూ.2 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. ఈ లెక్కన 50,000 ఎకరాలకు రూ.1 లక్ష కోట్లు, లక్ష ఎకరాలకు రూ.2 లక్షల కోట్లు అవసరమవుతాయని, ఇది రాష్ట్రాన్ని దివాళా తీయించడానికేనని విమర్శించారు. చంద్రబాబు తన గత, ప్రస్తుత పాలనలో కలిపి ఏడేళ్లలో కేవలం రూ.8,000 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఈ వేగంతో ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఎన్ని దశాబ్దాలు పడుతుందని ప్రశ్నించారు. నిర్మాణ వ్యయాల్లో భారీ అవినీతి జరుగుతోందని జగన్ ఆరోపించారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లో ఐదు నక్షత్రాల సౌకర్యాలతో ఫ్లాట్ నిర్మించడానికి చదరపు అడుగుకు రూ.4,500 ఖర్చయితే, అమరావతిలో రూ.11,000 నుంచి రూ.14,000 వరకు చూపిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక, భూమి, జీఎస్టీ మినహాయింపులు ఇస్తున్నా ఇంత భారీ వ్యయం ఎందుకని నిలదీశారు. టవర్ల నిర్మాణం, ఫ్లైఓవర్ల వ్యయాన్ని ఇతర నగరాలతో పోల్చి, భారీ వ్యత్యాసాలను ఎత్తిచూపారు. అమరావతిలో కిలోమీటర్ ఫ్లైఓవర్‌కు రూ.170 కోట్లు చూపిస్తుంటే, తన హయాంలో విజయవాడ బెంజ్ సర్కిల్‌లో కేవలం రూ.35 కోట్లతో పూర్తి చేశామన్నారు. ఢిల్లీలోని కొత్త పార్లమెంట్, తెలంగాణ సచివాలయం కన్నా ఏపీ అసెంబ్లీ, హైకోర్టుల నిర్మాణ వ్యయాలు ఎక్కువగా ఉండటాన్ని ఆయన తప్పుపట్టారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ కుటుంబాలు హైదరాబాద్‌లోనే ఉంటున్నాయని, వారు అమరావతికి కేవలం షటిల్ సర్వీస్ చేస్తున్నారని జగన్ ఎద్దేవా చేశారు. 2014 నుంచి ఇప్పటివరకు సుదీర్ఘకాలం పాలనలో ఉన్న చంద్రబాబు అమరావతికి ఏం చేశారని, రైతులకు ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. అమరావతిపై తీర్మానం పేరుతో అసెంబ్లీలో చంద్రబాబు కొత్త డ్రామా ఆడారని, సభను కేవలం తనను, వైసీపీని దూషించడానికి వాడుకున్నారని విమర్శించారు. అమరావతిపై ఉన్న శ్రద్ధ వల్ల విద్యా దీవెన, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని, రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా, కర్నూలును న్యాయ రాజధానిగా చేయాలన్నదే తమ విధానమని పునరుద్ఘాటించారు. తాము అధికారంలోకి వచ్చాక అమరావతి కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, దోషులను శిక్షిస్తామని జగన్ హెచ్చరించారు.

## కిడ్నీ రాకెట్ గుట్టురట్టు.. ఐదుగురు డాక్టర్లు అరెస్టు



**లక్నో:** కిడ్నీ అమ్ముకున్న వ్యక్తికి రూ.50,000 తక్కువ చెల్లించడంపై వివాదం తలెత్తింది. దీంతో భారీ కిడ్నీ రాకెట్ గుట్టు రట్టయ్యింది. ఈ నేపథ్యంలో ఐదుగురు డాక్టర్లతో సహా ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరికొందరు డాక్టర్ల కోసం గాలిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. బీహార్‌లోని సమస్తిపూర్‌కు చెందిన ఆయుష్, ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఎంబీఏ చదువుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల వల్ల కిడ్నీ రాకెట్ ట్రాప్‌లో అతడు పడ్డాడు. ఒక కిడ్నీని రూ.10 లక్షలకు అమ్ముకున్నాడు. కాగా, ఆయుష్‌తో ఒప్పందం కుదుర్చుకున్న వ్యక్తులు అతడికి రూ.9.5 లక్షలు మాత్రమే చెల్లించారు. రూ.50,000 తక్కువగా చెల్లించి తనను మోసం చేయడంపై అతడు ఆగ్రహించాడు. పోలీసులకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పాడు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులున్న యువతను ట్రాప్ చేస్తున్న అంబులెన్స్ డ్రైవర్ శివం అగర్వాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడ్ని ప్రశ్నించడంతో కిడ్నీ రాకెట్ వ్యవహారం గురించి పోలీసులకు తెలిసింది. మరోవైపు ముజఫర్‌నగర్‌కు చెందిన పారుల్ తోమర్ అనే రోగికి అత్యవసరంగా కిడ్నీ అవసరం కావడంతో ఆయుష్ అమ్ముకున్న కిడ్నీని ఆమెకు ట్రాన్స్‌ప్లాంట్ చేసినట్లు పోలీసులు తెలుసుకున్నారు. దీని కోసం ఆ మహిళ కుటుంబం నుంచి రూ. 60 లక్షలు వసూలు చేసినట్లు దర్యాప్తులో తెలిసింది. ఈ మొత్తం సమాచారం ఆధారంగా పోలీసులు, ఆరోగ్య శాఖ అధికారులు సంయుక్తంగా రంగంలోకి దిగారు. సోమవారం రాత్రి కాన్పూర్‌లోని కళ్యాణ్‌పూర్ ప్రాంతంలో ఉన్న అహుజా హాస్పిటల్, ప్రియా హాస్పిటల్, మెడ్ లైఫ్ హాస్పిటల్‌పై రైడ్ చేశారు. రిజిస్ట్రేషన్ లేకుండా మెడ్ లైఫ్ ఆసుపత్రి పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఆ హాస్పిటలో ఉన్న ఆయుష్, పరుల్‌ను పోలీసులు రక్షించారు. ఆయుష్ పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మరోవైపు కిడ్నీ రాకెట్‌కు సంబంధించి అహుజా ఆసుపత్రి యజమాని డాక్టర్ సుర్జిత్ సింగ్ అహుజా, ఆయన భార్య డాక్టర్ ప్రీతి అహుజా, డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్ రామ్ ప్రకాష్, డాక్టర్ నరేంద్ర సింగ్‌తో పాటు అంబులెన్స్ డ్రైవర్ శివం అగర్వాల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న కిడ్నీ రాకెట్ ప్రధాన సూత్రధారి డాక్టర్ అఫ్జల్, సర్జరీ బఅందంలోని ప్రధాన వైద్యులైన డాక్టర్ రోహిత్, వైభవ్ అనురాగ్ కోసం పోలీసులు వెతుకుతున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## లోక్‌సభ ఆమోదం

అమరావతి చట్టబద్ధత బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పార్లమెంటులో చర్చ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ అమరావతి చట్టబద్ధతకు మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. అమరావతికి తగినన్ని నిధులు అందించి ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించేలా కేంద్రం సహకరించాలని కోరారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీ ఇంకా పెండింగ్‌లోనే ఉందని మాణికం ఠాగూర్ అన్నారు. మిగిలిన హామీలన్నీ అమలు చేసి విభజనతో నష్టపోయిన ఏపీని ఆదుకోవాలని కోరారు.రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు జనసేన పార్టీ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ ఎంపీ వల్లభనేని బాలశౌరి లోక్‌సభలో ప్రకటించారు. రాజధాని విషయంలో గత ప్రభుత్వం చాలా ఇబ్బందులు తెచ్చిందని గుర్తుచేసిన బాలశౌరి ప్రజల పూర్తి మద్దతున్న అమరావతిని శాశ్వత రాజధానిగా ఉంచాలని కోరారు. దేశం మొత్తం రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు మద్దతు తెలిపితే వైఎస్సార్సీపీ మాత్రం వ్యతిరేకించడం దురదృష్టకరమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మండిపడ్డారు. అమరావతికి చట్టబద్ధత బిల్లు సందర్భంగా లోక్‌సభలో కలిశెట్టి మాట్లాడారు. వైఎస్సార్సీపీ ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేసి రైతుల త్యాగాలను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసంబద్ధంగా జరిగిన విభజన వల్ల నవ్యాంధ్రప్రదేశ్‌కు తప్పనిసరి పరిస్థితుల్లో అమరావతి రాజధానిగా ఏర్పడిందని బీజేపీ ఎంపీ పురందేశ్వరి అన్నారు. అలాంటి రాజధానిని వైఎస్సార్సీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు అనిశ్చితిలోకి నెట్టేశాయని ఆక్షేపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన బిల్లు-2014 పార్లమెంటు ఆమోదం పొందిందని పురందేశ్వరి గుర్తేచేశారు. కాబట్టి రాజధాని మార్పు విషయం కూడా పార్లమెంటు ఆమోదం పొందాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రాజధాని విషయంలో మరో రాష్ట్రానికి ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు అమరావతికి చట్టబద్ధత బిల్లు చట్టరూపం దాల్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అమరావతి చట్టబద్ధత చట్టంతో ఆంధ్రప్రదేశ్‌లో ఇక మూడు ముక్కలాటలు సాగబోవని బీజేపీ ఎంపీ సీఎం రమేష్ ఉద్ఘాటించారు. పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టాక చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. రాజధాని అనేది కొన్ని నిర్మాణాల సముదాయమో, ఒక నగరమో కాదని సీఎం రమేష్ అన్నారు. అమరావతి తెలుగు ప్రజల గుండె చప్పుడని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో అమరావతిని నాశనం చేయడానికే పూనుకుని అదే పనిగా దుశ్చర్యలకు పాల్పడిందని ఎండగట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే 30 ఏళ్లూ ఎన్డీఏ కూటమి పాలనే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఇక ఎవరూ రాజధాని అమరావతిని ఇంచు కూడా కదల్చలేరని కుండబద్దలు కొట్టారు. అమరావతికి వ్యతిరేకం కాదంటూనే చట్టబద్ధత బిల్లును వైఎస్సార్సీపీ వ్యతిరేకించింది. ప్రస్తుత స్థితిలో ఉన్న బిల్లును వ్యతిరేకిస్తున్నామంటూ వైఎస్సార్సీపీ ఎంపీలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేశారు. అమరావతి చట్టబద్ధత బిల్లుతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఎంపీ మిథున్‌రెడ్డి విమర్శించారు. అమరావతి పేరుతో హడావుడిగా బిల్లు తెచ్చేస్తే సరిపోదని రైతులకు ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరుస్తారో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

## చేయలేరు: చంద్రబాబు

వైసీపీ లాంటి పార్టీని, జగన్ లాంటి వ్యక్తిని చూడలేదు' అని అన్నారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని విధ్వంసం చేసి ఆనందించారని మండిపడ్డారు. అమరావతి తీర్మానం రోజున వైసీపీ సభ్యులు అసెంబ్లీకి రాలేదన్నారు. అమరావతి ఏకైక ప్రజా రాజధాని అని... ఇక ఇంచు కూడా ఎవ్వరూ కదిలించలేరని స్పష్టం చేశారు. అమరావతికి చట్టబద్ధత తీర్మానంపై లోక్‌సభలో చర్చ జరుగుతోందని... ఆమోదం పొంది గురువారం రాజ్యసభకు వెళుతుందని సీఎం తెలిపారు. ఒకటో తేదీ వస్తే పేదలే గుర్తొస్తారని.. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా ఫించన్లు పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. 63 లక్షల మందికి ఫించన్లు ఇస్తున్నామన్నారు. ఫించన్లను మొక్కుబడిగా ఇవ్వడం లేదని... గౌరవంగా ఇంటి వద్దే ఇచ్చే కార్యక్రమం చేపట్టామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫించన్లు, తల్లికి వందనం ఇచ్చామని తెలిపారు. స్త్రీశక్తి సూపర్ సక్సెస్ అయిందని.. ఆడబిడ్డలు దర్జాగా ఎక్కడికి వెళ్లాలంటే అక్కడికి వెళుతున్నారని తెలిపారు. 'మా ఆడబిడ్డల కోసం దీపం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇచ్చాం. ఇప్పుడు మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. పీఎంజీ కనెక్షన్ తీసుకున్నా.. ఏడాదికి రూ.2,465లు సబ్సిడీ ఇస్తాం' అని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ ఏడాదిలో వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసి ఉదయగిరికి కూడా నీరిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# సమస్యల పరిష్కారంపై స్పందించకపోతే 28న సెక్రటేరియట్‌ను ముట్టడిస్తాం : యుటిఎఫ్



**కృష్ణా జిల్లా, పతాకం న్యూస్:** ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పై ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 28 న సెక్రటేరియట్ ముట్టడిస్తాం అని యు టి ఎఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఎస్ ఎస్.ప్రసాద్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ .... ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో రణభేరి 3.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ' నిరాహార దీక్ష ' నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ..... ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందన్నారు. 12 వ పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏలు, బకాయిల చెల్లింపు, మెమో-57 అమలు, హెల్త్ స్కీమ్ వంటి కీలక అంశాలపై ఇప్పటికీ స్పష్టమైన నిర్ణయాలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. సీపీఎస్ రద్దు చేసి మెమో-57 ప్రకారం పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో ఈ నెల 28 న సెక్రటేరియట్ ముట్టడికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని, సరైన ప్రణాళికల లోపంతో విద్యా వ్యవస్థ దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంపై తగినంత నిధులు ఖర్చు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. దీనివల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని, ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో ప్రజలను దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ఉద్యోగ నియామకాల విషయంలో ప్రభుత్వం స్పష్టత లేకుండా వ్యవహరిస్తోందని, గతంలో వేలల్లో జరిగిన డీఎస్సీ నియామకాలు ప్రస్తుతం గణనీయంగా తగ్గిపోయాయని, తాత్కాలిక ఉద్యోగాలే పెరుగుతున్నాయన్నారు. ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత లేదన్నారు, ఒక డీఏ కోసం రూ.1100 కోట్లు విడుదల చేశామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఉపాధ్యాయులకు పూర్తి స్థాయిలో అందలేదన్నారు. ప్రస్తుతం ఐదు డీఏలు బకాయిగా ఉన్నాయని 2023లో అమలు చేయాల్సిన పీఆర్సీ 32 నెలలు గడిచినా అమలు కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు పీఆర్సీ ప్రకటించి, తిరిగి అధికారంలోకి వస్తే అమలు చేస్తామన్న ధోరణి ప్రజలను మోసం చేసే ప్రయత్నమన్నారు.

# వాహన వేగ పరిమితి నిబంధనపై సర్వత్రా చర్చ

## డ్రైవర్‌లు వేగపరిమితిపై దృష్టిపెడితే ప్రమాదాలు?




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరంలో పోలీసులు అమలు చేస్తున్న గరిష్ఠ వేగ పరిమితి నిబంధనలపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. వేగపరిమితి 40 కిలోమీటర్లకు మించితే జరిమానా విధిస్తామని సీపీ శంఖబ్రతబాగ్చి ఇటీవల హెచ్చరించిన విషయం తెలిసిందే. అయితే 40 కిలోమీటర్ల పరిమితి పాటించేందుకు వాహన చోదకులు ఎప్పటికప్పుడు స్పీడో మీటర్‌పై దృష్టిపెడితే ఏకాగ్రత దెబ్బతిని రోడ్డు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలంటే వాహనాల వేగానికి కళ్లెం వేయాలని సీపీ శంఖబ్రతబాగ్చి భావించారు. దీనికోసం నగర పరిధిలో అగనంపూడి నుంచి కొమ్మాది వరకు జాతీయ రహదారిపైనా, కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి వరకు బీచ్‌రోడ్డులోనూ, నగర పరిధిలోని అన్ని మునిసిపల్ రోడ్లపైన వాహనాల గరిష్ఠ వేగపరిమితిని 40 కిలోమీటర్లుగా నిర్ణయించారు. అంతకంటే ఎక్కువ వేగంతో వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నగరంలో వాహనాల వేగపరిమితిపై నిఘా పెట్టేందుకు ఎక్కడికక్కడ లేజర్‌గన్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. గరిష్ఠ వేగపరిమితి మించితే రూ.వెయ్యి జరిమానా విధించడంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెన్షన్ కోసం రవాణా శాఖ అధికారులకు పంపిస్తామని స్పష్టంచేశారు. సీపీ ప్రకటనపై నగరంలో తీవ్ర చర్చ జరుగుతోంది. చాలామంది సీపీ నిర్ణయాన్ని తప్పుపడుతుండగా, కొందరు మాత్రం నగర నడిబొడ్డున 40 కిలోమీటర్లు వేగపరిమితి ఉంచడంలో తప్పులేదుగానీ, డెయిరీ ఫారం నుంచి కొమ్మాది వరకు, ఎన్ఏడీ జంక్షన్ నుంచి అగనంపూడి వరకు వేగపరిమితిని 60 కిలోమీటర్లకు పెంచే దిశగా ఆలోచన చేయాలన సూచిస్తున్నారు. వాహన చోదకులు వేగం 40 కిలోమీటర్లులోపే ఉండేలా నిరంతరం పర్యవేక్షించుకోవాలనుకుంటే ప్రమాదాలను కొనితెచ్చుకున్నట్టేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. నగరంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది కాబట్టి, గ్రీన్‌సిగ్నల్ పడిన తర్వాత వాహనాలను వేగంగా ముందుకు నడపాల్సి ఉంటుందని, ఒకవేళ నెమ్మదిగా వెళితే ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారి సిగ్నల్ దాటడానికే రెండు, మూడుసార్లు వేచివుండాల్సిన పరిస్థితి వస్తుందని పలువురు చెబుతున్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్య పెరగడంతోపాటు వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడం సాధారణంగా మారిపోతుందని అభిప్రాయపడుతున్నారు. వాహనం నడిపే వ్యక్తి వేగం 40 కిలోమీటర్లులోపే ఉందో లేదో తెలుసుకునేందుకు తరచూ స్పీడోమీటర్‌పై దృష్టిపెట్టాల్సి ఉంటుందని, ఆ సమయంలో రోడ్డుపై ముందువెళ్లే వాహనం ఆగినా, ఎవరైనా అడ్డువచ్చినా గమనించేందుకు అవకాశం ఉండదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ముందువెళ్లే వాహనాలు నెమ్మదిగా నడుస్తుంటే వెనుకనుంచి భారీ వాహనాలు ఢీకొన్న సందర్భాలు ఉన్నాయని గుర్తుచేస్తున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఈ ఏడాది జూన్ నుంచి అందుబాటులోకి తెస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే ప్రకటించాయి. ఇటువంటి తరుణంలో వేగపరిమితి విధించడం ఎందుకంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. నగరం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలంటే ఇప్పుడు గంటకుపైగా సమయం పడుతుందని, ఉదయం, సాయంత్రం వేళల్లో అయితే మరో 30 నిమిషాలు అదనంగా పడుతుందని, అలాంటి సమయంలో 40 కిలోమీటర్లు మించిన వేగంతో వాహనం నడిపితే జరిమానా తప్పదని హెచ్చరించడం సరికాదని పేర్కొంటున్నారు. డెయిరీఫారం దాటిన తరువాత వాహనాలు కనీసం 60 కిలోమీటర్ల వేగంతో వెళతాయని, అలాంటిచోట కూడా 40 కిలోమీటర్లు మించకూడదని చెప్పడం సమంజసం కాదనే వాదన వినిపిస్తోంది. ప్రమాదాల నియంత్రణకు ఇతర చర్యలపై దృష్టిపెట్టాలని కోరుతున్నారు.

# రఘురామకృష్ణరాజును పదవి నుంచి తొలగించాలి

**ఆరిలోవ, పతాకం న్యూస్:**ఆకివీడులో కుల మతాల ఘర్షణకు కారకుడైన డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజును పదవి నుండి తొలగించాలని, పెదపేట దళితవాడపై మూకుమ్మడి దాడికి తెగబడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండు చేశారు. ఆకివీడులో శ్రీరామ నవమి రోజున డిప్యూటీ స్పీకర్ నాయకత్వంలో పెదపేటకు వచ్చి దళితులను కొట్టిన వారిని అరెస్టు చేయాలని, గొంతేనమ్మ గుడిని ప్రభుత్వమే నిర్మించాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ భవన్ వద్ద విదసం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ, ఆకివీడు పెదపేటలో శిథిలమైన గొంతేనమ్మ గుడి స్థానంలో రాముడి గుడి కట్టి తీరుతామని, ఉండి నియోజకవర్గంలో అనుమతిలేని చర్చులు 113 ఉన్నాయని రఘు రామకృష్ణరాజు మత కలహాలు రేపే ప్రకటనలు చేయడం బాధ్యత రాహిత్యం అన్నారు. దళితులపై కక్షగట్టి ఎగతాళి చేయడం చట్ట వ్యతిరేకం అన్నారు. జరిగిన ఘర్షణకు రఘు రామకృష్ణ రాజు బాధ్యత వహించాలన్నారు. దళితుల వాంగ్మూలం ఆధారంగా కేసులు నమోదు చేయాలని, పోలీసులు అదుపులోకి తీసుకున్న దళితులను కోర్టు ముందు హాజరు పరచాలని డిమాండ్ చేశారు.సోడదాసి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాజి ఓంకార్, గుడివాడ ప్రసాద్, డి.నిర్మల, ఎస్.సన్యాసిరావు, బంటు కృష్ణారావు, జి.రామారావు, గుడాల ఈశ్వరరావు, యుఎస్.రాజు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ పరిధిలో రికార్డు స్థాయిలో

# వసూలైన ఆస్తి పన్ను




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జీవీఎంసీ పరిధిలో ఆస్తి పన్ను రికార్డు స్థాయిలో వసూలైంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను కింద రూ.620 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ మొత్తం గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే రూ.110 కోట్లు అధికం. జీవీఎంసీ పరిధిలో 6,02,937 ప్రైవేటు అసెస్‌మెంట్‌ల నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను/బకాయిలు కింద రూ.569.59 కోట్లు, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు నుంచి బకాయిల రూ.200 కోట్లు వసూలుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తూ వచ్చారు. బకాయిదారులకు జప్తు నోటీసులు ఇవ్వడంతోపాటు స్పందించని వారి ఆస్తులను సీజ్ చేశారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన వైజాగ్ పోర్టు ట్రస్ట్, హెచ్‌పీసీఎల్ వంటి వాటితో కమిషనర్ కేతన్‌గార్గ్ స్వయంగా సంప్రతింపులు జరిపి, ఆస్తి పన్ను బకాయిలు చెల్లించేలా చొరవ తీసుకున్నారు. వీటన్నింటి కారణంగా ఆస్తిపన్నుతోపాటు బకాయిలు వసూళ్లలో పురోగతి కనిపించింది. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం బకాయిలపై 50 శాతం మేర వడ్డీ రాయితీ కల్పించడం కలిసివచ్చింది. ప్రైవేటు అసెస్‌మెంట్‌ల బకాయిలు రూ.134.54 కోట్లు ఉండగా రూ.74.14 కోట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను కింద రూ.435.05 కోట్లకుగాను రూ.382 కోట్లు మొత్తం రూ.456.15 కోట్లు వసూలుచేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పన్నుతోపాటు బకాయిల కింద రూ.163.85 కోట్లు వసూలు చేశారు. మంగళవారం వైజాగ్ పోర్టు ట్రస్ట్ నుంచి రూ.12 కోట్లు, హెచ్‌పీసీఎల్ నుంచి రూ.7.62 కోట్లు జమ అయ్యాయి. రికార్డు స్థాయిలో పన్ను వసూలుకావడంపై డీసీఆర్ శ్రీనివాసరావు స్పందిస్తూ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశాల మేరకు కార్యాచరణ రూపొందించి అమలుచేశామన్నారు. గత ఏడాది కంటే సుమారు రూ.110 కోట్లు అధికంగా పన్ను వసూలు కావడం ఆనందంగా ఉందన్నారు.

# రేషన్ డిపోలో తనిఖీలు

## రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు



**పాయకరావుపేట, పతాకం న్యూస్:** ఏప్రిల్ నెల రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభం కాకముందే పాయకరావుపేటలోని ఒక రేషన్ డిపో డీలర్ సరుకులను పక్కదారి పట్టించారు. ఇది గమనించిన స్థానికులు అక్రమంగా తరలిస్తున్న సరుకులను పట్టుకొని అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానికుడైన రాష్ట్ర పౌరసరఫరా కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్తు, తహశీల్దారు మహేశ్వరరావు వచ్చి రేషన్ డిపోలో తనిఖీలు చేపట్టారు. 106 కిలోల రాగులు, 48 కిలోల పంచదార తక్కువ ఉన్నట్టు గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. పాయకరావుపేట ఎల్‌టీ కాలనీలో ఉన్న రేషన్ షాపు నంబర్-3కు సంబంధించిన డీలర్, ఏప్రిల్ నెలలో కార్డుదారులకు పంపిణీ చేయడానికి బియ్యం, రాగులు, పంచదారను ఇటీవల ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి విడిపించారు. బుధవారం నుంచి వీటిని కార్డుదారులకు అందజేయాల్సి వుంది. కొంతమంది వ్యక్తులు రేషన్ డిపో నుంచి మూటలు తీసుకెళుతుండడాన్ని స్థానికులు గుర్తించి అడ్డగించారు. అప్పటికే కొన్ని మూటలు తరలించగా, రెండు రాగుల మూటలను పట్టుకొని అధికారులకు సమాచారం అందించారు. తహశీల్దారు మహేశ్వరరావు, ఆర్ఐ త్రినాథ్‌తోపాటు రాష్ట్ర పౌరసరఫరా కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్తు రేషన్ డిపో వద్దకు వచ్చి తనిఖీలు చేపట్టారు. రికార్డుల్లో వున్న స్టాకుకు, డిపోలో వున్న సరుకులకు మధ్య వ్యత్యాసం వున్నట్టు గుర్తించారు. 106 కిలోల రాగులు, 48 కిలోల పంచదార తక్కువ వున్నట్టు నిర్ధారించారు. రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు.

# బ్రిడ్జిలు నిర్మించకపోతే ఉద్యమిస్తాం

## సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా వి. మాడుగుల, మండలం శంకరం పంచాయతీలోని అసం పూర్తిగా నిలిచి పోయిన గ్రామాలైన కోత్తవలస.వెలగలపాడు గోప్పూరు.తాడివలస. రాజంపేట.రాయిపాలెం గిరిజన గ్రామాలకు రోడ్లుసౌకర్యం కల్పించి కోత్తవలస. తాడివలస. గెడ్డలుపై రెండు బ్రిడ్జిలను. నిర్మించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి. ఇరట.నరసింహమూర్తి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కే. భవాని గెడ్డలు రోడ్లు పరిశీలించి బ్రిడ్జిలు రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు వారు మాట్లాడుతూ ఆరు గ్రామాలకు చేందిన గిరిజనులు కు అడిగి తెలుసుకున్నారు బ్రిడ్జిలు నిర్మించకపోతే ఉద్యమం చేపడుతామని అన్నారు. ఎన్నికల ముందు ఈ గ్రామాలకు రోడ్లు సౌకర్యం కల్పించాలని 9,30 తోమ్మిది కోట్ల ముప్పైలక్షల రూపాయలతో రోడ్లు బ్రిడ్జిలు నిర్మిస్తున్నట్లు, కోంత మేరకు పనులు చేసిన ఎన్నికల అయ్యి రెండు సంవత్సరాలు అయినది ఈ ప్రభుత్వం.వచ్చిన తరువాత మరల పాత పనులను రద్దు చేసి .వీబీ =జు+రా మరియు నాబార్డు నిదులతో కోత్తగా 11 కోట్లురూపాయలతో. ఇస్టుమేట్ వేసి కూటమి ప్రభుత్వనికి ప్రతి పాదనులు పంపించి నట్లు అధికారులు చెబుతున్నారన్నారు. వర్షం వస్తే గెడ్డలు దాట లేక గర్బిని స్త్రీలును బాలింతలను డోలిలు కట్టి మోసుకు వెళ్ళవలసి వస్తుందని తెలిపారు చిన్న పిల్లలు స్కూలుకు వెళ్ళలాన్న ముసలి వారు ఆసు పత్రికి వెల్లాలాన్న తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు,గోట్టి వాడ నుండి కోత్తవలస. వెలగలపాడు. గోప్పురు. తాడివలస. రాయిపాలెం రాజంపేట. క్రిష్ణంపాలెం తారురోడ్డు వరకు రోడ్డు సౌకర్యం కల్పిస్తె వందలాది మంది గిరిజన ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించే అవుతారని ఈ కార్యక్రమంలో గిన్నెపల్లి సన్యాసమ్మ సర్పంచ్ సోలం.రమేష్ వార్డు మెంబర్లు జన్ని చిన్నారావు తుర్రి ఈశ్వరరావు జనపరెడ్డి అప్పారావు జనపరెడ్డి రాజు అధిక సంఖ్యలో గిరిజనలు మహిళలు పాల్గొన్నారు

# యువత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి: ప్రదీప్





**మల్కాపురం, పతాకం న్యూస్:** యువత నైపుణ్యాలను పెంచుకొని,ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని,సంపదను సృష్టించాలని అస్త్ర మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ రాజా ప్రదీప్ పిలుపునిచ్చారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలోబుధవారం నిర్వహించిన సీనియర్ డిగ్రీ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ- ప్రస్తుత భవిష్యత్తు క్వాంటం టెక్నాలజీదేనని అన్నారు. సృజనాత్మకతను, భావోద్రేకాలను, భావ ప్రకటనను కృత్రిమ మేధస్సు అధిగమించలేదని అన్నారు. కార్యక్రమంలో బెస్ట్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ గాయత్రి, కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా జూనియర్ విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.ఈ సందర్భంగా నిర్వహించిన మిస్ సెయింట్ ఆన్స్- 2026 పోటీలో విజేతలకు, జాతీయ సేవా పథకం, క్రీడలు మొదలైన ఇతర అంశాలలో ప్రతిభ చూపిన వారికి బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు,విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయం స్థలం పరిశీలన



**కొత్తూరు, పతాకం న్యూస్:** అనకాపల్లి మండలం సుందరయ్యపేట పంచాయతీ అచ్చియ్యపేట గ్రామ పరిధిలో కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన భూమిని కేవీ భవన నిర్మాణ సంస్థ ఇంజనీర్ ప్రసాద్, ప్రిన్సిపాల్ గౌరీశంకర్, సర్వేయర్ అశ్విని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజనీర్ ప్రసాద్ మాట్లాడుతూ, సీతానగరం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 511లో పది ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కేటాయించారని, దీనికి సంబంధించి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తే మూడు నెలల్లో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లా సర్వేయర్, తహశీల్దార్ తదితర అధికారులతో మాట్లాడిన అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## 'సదరం' శిబిరాలు ప్రారంభం



**నరసన్నపేట, పతాకం న్యూస్:** దివ్యాంగులకు వైకల్యాన్ని నిర్ధారించేందుకు నిర్వహించే పరీక్షలకు (సదరం) ప్రభుత్వం మళ్లీ శ్రీకారం చుట్టింది. గతంలో జరిగిన అక్రమాలకు కళ్లెం వేసేందుకు కూటమి ప్రభుత్వం కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ఏరియా ఆసుపత్రుల్లో 'సదరం' శిబిరాలు ప్రారంభమయ్యాయి. కొత్తగా దివ్యాంగుల గుర్తింపు పత్రాల కోసం గత నెల 25న సచివాలయాల్లో స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించారు. మూడు నెలల పాటు ప్రతి సోమ, మంగళవారాల్లో సర్వజన ఆసుపత్రి, జిల్లా ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీలలో సదరం శిబిరాలను ఏర్పాటు చేస్తారు. కొత్తగా ఆరు రకాలైన వ్యాధులకు అవకాశం ఇవ్వడంతో వారంతా స్లాట్లు బుక్ చేసుకుంటున్నారు. వీరికి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఎక్కువగా పక్షవాతంతో బాధ పడేవారు స్లాట్లు బుక్ చేసుకున్నారు. కొత్తగా సుమారు 11 వేల మంది వరకు దరఖాస్తు చేసుకున్నట్లు వైద్యఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. వీరికి మూడు నెలల పాటు నిర్ణయించిన రోజున పరీక్షలు చేసి.. అంగవైకల్య శాతాన్ని నిర్ధారిస్తారు. స్పెషలిస్టు వైద్యులు పరీక్షించి...అక్కడికక్కడే కొత్తగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో మంగళవారం 40 మంది శారీరక దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఎక్కువగా పక్షవాతం బారిన పడిన వారితో పాటు ప్రమాదాల్లో అంగవైకల్యానికి గురైన వారు ఉన్నారు. సదరం శిబిరాలను నిర్వహించే ఆసుపత్రుల వద్ద సరైన ఏర్పాట్లు లేకపోవడంతో దివ్యాంగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. శారీరక అంగవైకల్యం గల వారు ఒంటటరిగా వచ్చేందుకు వీలుపడక వేరొకరి సాయంతో వస్తారు. వీరు కూర్చునేందుకు కనీసం బల్లలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో నేలమీదనే కూర్చొని నిరీక్షిస్తున్నారు.

## జూన్ నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో మంజూరైన గృహ నిర్మాణాలన్నింటినీ ఈ ఏడాది జూన్‌లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుండి గృహ నిర్మాణ ప్రగతిపై హౌసింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు మండలాల వారీగా డిఇలు, ఎఇలు లబ్ధిదారులతో సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళీమోహన్, అధికారులు పాల్గొన్నారు.భూసేకరణ ప్రక్రియ వేగవంతం జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబందించిన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, అటవీ, రోడ్లు భవనాలు, ఉద్యానశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి భూసేకరణ ప్రక్రియలను నిర్ణీత గడువు లోగా పూర్తిచేసి, ప్రాజెక్టులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవా లన్నారు. సమావేశంలో జెసి సేధు మాధవన్, డిఆర్ఒ సిహెచ్. సత్తిబాబు, ఆర్‌డిఒలు, ఆర్‌అండ్‌బి ఇఇ, ఇరిగేషన్, జాతీయ రహదారులు, రైల్వే అధికారులు, తహశీల్దార్లు, ఎల్‌ఎ యూనిట్ల డిటిలు పాల్గొన్నారు.ఆసుపత్రుల భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలిజిల్లాలో నిర్మాణంలో గల ఆసుపత్రుల నూతన భవన నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భోగాపురం, ఎస్ కోట, నెల్లిమర్ల, బాడంగి, చీపురుపల్లి, గజపతినగరం, రాజాం, బొబ్బిలి ఆసుపత్రుల నూతన భవనాల పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. పనుల పురోగతిని సమీక్షించి నూతన పనులు కొరకు ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. సమావేశంలో డి సి హెచ్ ఎస్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఏపీ ఎంపీలపై షర్మిల ఫైర్

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణికం ఠాగూర్ ప్రసంగించారు. ఈ నేపథ్యంలోనే, తెలుగు ఎంపీలపై షర్మిల విరుచుకుపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు. పార్లమెంట్ వేదికగా ఏపీ విభజన హామీల గురించి గళం విప్పిన మాణికం ఠాగూర్‌కు రాష్ట్ర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. అయితే, ఆయన మాట్లాడుతున్నప్పుడు రాష్ట్రం నుంచి గెలిచిన ఒక్క ఎంపీ కూడా మద్దతుగా నిలబడకపోవడం తెలుగుగడ్డ చేసుకున్న దౌర్భాగ్యమని మండిపడ్డారు. "మన ఎంపీలకు స్వలాభం మిన్న, రాష్ట్ర ప్రయోజనాలు సున్నా. పేరుకు మాత్రమే వేర్వేరు పార్టీల ఎంపీలు, కానీ అందరూ మోదీకి భజనపరులే. బీజేపీ బిల్లులకు గొర్రెల్లా తలలూపడం తప్ప, 11 ఏళ్లు గడుస్తున్నా హోదా ఏమైందని అడిగే దమ్ము ఒక్కరికీ లేదు" అని షర్మిల ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41 మీటర్లకే పరిమితం చేస్తామని లిఖితపూర్వకంగా చెబుతున్నా, రాజధాని అమరావతి నిర్మాణానికి సాయం చేయలేమని స్పష్టం చేస్తున్నా ఎంపీలు నోరు మెదపడం లేదని ఆమె విమర్శించారు. ఇప్పటివరకు విభజన హామీలలో 5 శాతం కూడా అమలు కాలేదని, అయినా మన ఎంపీలు మౌనం వహిస్తూ 'గుడ్డి గుర్రాలకు పళ్లు తోముతున్నారని' ఘాటుగా వ్యాఖ్యానించారు. "2014లోనే విభజన హామీల విలువ 5 లక్షల కోట్లు. అది మన చేతిలో ఉన్న చెక్కు లాంటిది. కానీ మన ఎంపీల అసమర్థత వల్లే దాన్ని ఎన్‌క్యాష్ చేసుకోలేకపోతున్నాం. తెలుగువారి ఆత్మగౌరవాన్ని, పౌరుషాన్ని ప్రధాని మోదీ కాళ్ల దగ్గర తాకట్టుపెట్టారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా ప్రశ్నించే ధైర్యం లేని 25 మంది లోక్‌సభ, 11 మంది రాజ్యసభ సభ్యులు వెంటనే రాజీనామా చేయాలి" అని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

# వెంటనే అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి




**విజయనగరం, పతాకం న్యూస్:** పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, చట్ట ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, మేనెలంతా వేసవి సెలవులు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అంగన్వాడీలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పోస్ట్ కార్డు క్యాంపెయిన్ చేపట్టాలన్నారు. వాటిని సిడిపిఒల ద్వారా పంపనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి పి.జ్యోతి, అధ్యక్షులు ఎం.సుభాషిని, సెక్టార్ లీడర్లు నారాయణమ్మ, సన్యాసమ్మ, పైడ్రాజు, ముత్యాలమ్మ, రవణమ్మ, ఉష అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు పాల్గొన్నారు. విజయనగరం అర్బన్ ప్రాజెక్ట్ ఆఫీస్ వద్ద అంగన్వాడీలు ధర్నా నిర్వహించి సిడిపిఒ రేఖ వాణికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి ఎ.జగన్మోహన్రావు, యూనియన్ అధ్యక్ష , కార్యదర్శులు సునీత, కె.ప్రభావతి మాట్లాడుతూ గత ప్రభుత్వ సమయంలో 42 రోజులు సమ్మె చేశామని, అప్పటి ప్రతిపక్షంగా ఉన్న కూటమి ప్రభుత్వం వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్న వేతనాలు పెంచలేదని అన్నారు. జీతాలు పెంచి, గ్రాడ్యుటీకి గైడ్లైన్స్ ఫ్రేమ్ చేసి జీవో ఇచ్చేంత వరకు, సంక్షేమ పథకాల అమలు కోసం దశల వారీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బి.పైడిరాజు, ప్రాజెక్టు గౌరవ అధ్యక్షులు చిట్టి తల్లి, సెక్టార్ లీడర్లు సత్యవతి, రత్నం, కుమారి, కరుణ, జయ, రమా పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణం పోయిన తర్వాత కన్నం కప్పారు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** సుసరాం తంపర వద్ద ప్రధాన రహదారికి మూడునెలల కిందట ఏర్పడిన కన్నం (రంధ్రం) ఓ మహిళ ప్రాణంపోయిన తర్వాత మొక్కుబడిగా కప్పారని ప్రియాగ్రహారం, సుసరాం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి ఉర్జాం గ్రామానికి చెందిన రోణంకి తేజేశ్వరి ఇదే కన్నం వద్ద తన వాహనం అదుపుతప్పడంతో ప్రాణాన్ని కోల్పోయి, మరో మహిళ తీవ్రంగా గాయపడ్డారని వారు గుర్తుచేశారు. ఆర్అండ్‌బీ రోడ్డులో సుసరాం తంపర వద్ద మూడునెలల కిందట రంధ్రం ఏర్పడిందని, దీనిపై ముళ్లకంపలు, ఎర్రగుడ్డలతో రంధ్రాన్ని నింపారే తప్పా మరమ్మతులు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణం పోయిందని, ఇప్పుడు స్పందించిన అధికారులు తూతూ మంత్రంగా రంధ్రాన్ని కప్పి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేచోట మళ్లీ రంధ్రం ఏర్పడి ప్రమాదాలు జరగవచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఇంజనీర్‌కు ఫోన్ చేసినా స్పందనలేదని, కార్యాలయానికి వెళ్లినా ఫలితం లేకపోయిందని గ్రామానికి చెందిన ప్రభాకర్ తెలిపారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలని కోరారు.

## సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**విజయనగరం, పతాకం న్యూస్:** సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పి. అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. కోటి 50లక్షలతో నగరంలోని వై జంక్షన్ నుండి చిన్నాపురం వరకు చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు (లేయర్ ఫార్మేషన్) గొల్లలపేట చెరువు వద్ద ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొత్తపేట నీళ్ల ట్యాంక్ జంక్షన్‌లో రోడ్ల అభివృద్ధి పనులు రూ.3కోట్లతో చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తూర్పుకాపు చైర్మన్ పాలవలస యశస్విని, పార్టీ కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు ఈగల సత్తిబాబు, జిల్లా బిజెపి అధ్యక్షులు రాజేష్ వర్మ, ఎఎంసి వైస్ చైర్మన్ చంద్రనాయుడు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలి నాయుడు, ప్రధాన కార్యదర్శి పాశి అప్పలనాయుడు, గుండాలపేట సర్పంచ్ కంది జగదీశ్వరి, సారిక సర్పంచ్ బొబ్బాది ఈశ్వరరావు, చెల్లూరు సర్పంచ్ ఆదినారాయణ, గొల్లలపేట ఎంపిటిసి బూర రమణ, చెల్లూరు ఎంపిటిసి పాండ్రంకి శంకర్రావు, మాజీ ఎంపిపి కంది సాయి జగ్గారావు, ఎంపిడిఒ వెంకట్రావు, జెఇ విక్రం తదితరులు పాల్గొన్నారు. విద్యుత్ లైన్లు అనుసంధాన ప్రక్రియను ప్రారంభించిన ఎమ్మెల్యే విటి అగ్రహారం 132/33 కెవి సబ్‌స్టేషన్ నుండి దాసన్నపేట వరకు నిర్మించిన 5కిలోమీటర్ల సరికొత్త 33 కెవి ఇంటర్ లింకింగ్ లైన్ మంగళవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఈ నూతన లైన్‌ను ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, విద్యుత్తుశాఖ ఎస్ఇ లక్ష్మణరావు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టౌన్ డివిజన్ పరిధిలో విద్యుత్ మౌలిక సదుపాయాల కల్పనలో ఇది ఒక మైలురాయి అని పేర్కొన్నారు. దీనివల్ల లో-వోల్టేజ్ సమస్య ఉండదన్నారు. లైన్ ఫాల్ట్ జరిగినప్పుడు నిమిషాల వ్యవధిలోనే ప్రత్యామ్నాయ మార్గంలో సరఫరా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇఇ త్రినాధరావు, టౌన్ ఎడిఇ కిరణ్ కుమార్ విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకం

**గాజువాక, పతాకం న్యూస్:** మలబార్ చారిటబుల్ ట్రస్ట్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా గాజువాక షోరూం పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివిన ప్రతిభావంతులైన బాలికలకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. గాజువాక బిసి రోడ్డులోని స్వామి కన్వెన్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో సుమారు 112 మంది విద్యార్థులకు రూ.8.96 లక్షల నగదును, ప్రశంసా పత్రాలను అందజేశారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అసిస్టెంట్ స్టోర్ హెడ్ మొహమ్మద్ షాహీన్ ఇషాక్, అసిస్టెంట్ షోరూమ్ మేనేజర్ ఎన్ఎల్.అనూష, గాజువాక తహశీల్దార్ శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, పులి లక్ష్మీబాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, వ్యాపార రంగాన్ని అభివృద్ధి చేస్తూనే సామాజిక సేవ ద్వారా ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేయడం అభినందనీయమన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి



**వజ్రపుకొత్తూరు, పతాకం న్యూస్:** నువ్వలరేవు గ్రామంలో తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. తాగునీటి కష్టాలు ఎదురువ్వడంతో గ్రామ స్థులు నానా కష్టాలు పడుతున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటూ అవస్థలకు గురవుతున్నారు. కొంతమంది రిక్షాలపై, వాహనాల పై మరికొందరు తలలపై బిందెలు పెట్టుకు నీటిని తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఉత్సవాలు నేపథ్యంలో నువ్వలరేవు గ్రామంలో దాదాపు 10 వేలకుపై బడి జనాభా ఉన్నారు. గ్రామంలో ఉన్న తాగు నీటి బావులు ఎండిపోవడంతో వీరంతా ఉద్దానం ప్రాజెక్టు, జల్ జీవన్ పథకం ద్వారా సరఫరా అయ్యే నీటి పైనే ఆధారపడుతున్నారు. అయితే సాంకేతిక కారణాలు వల్ల గత 10 రోజులుగా గ్రామానికి తాగునీరు రాకపోవడంతో గ్రామ స్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు సైతం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంపై గ్రామస్థులు మండిపడు తున్నారు. ఎంతో సందడిగా జరిగే ఉత్స వాల సమయంలో నీటికోసం ఇన్ని ఇబ్బం దులు పడడంపై వారంతా నిట్టూరుస్తున్నా రు. తాగునీటి కోసం కిలోమీటరు దూరం వెళ్లి రావాల్సి వస్తుందని పలు వురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది రాజీపేట, కాశీన గర్ గ్రామాలకు వెళ్లి తాగునీరు తెచ్చుకుం టున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారు లు స్పందించి తాగునీ టి సమస్యను పరిష్క రించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో పెళ్లి కొడుకు మృతి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** రెండు రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన ఆ యువకుడిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కాటేసింది. పెద్ద దిక్కుగా ఉంటాడని భావించిన ఆ తల్లి ఆశలు అడియాశలయ్యాయి. తండ్రిలేని ఆ కుటుంబానికి కుమారుడు వలసకూలీగా ఉంటూ జీవితాంతం తోడుంటాడని భావించిన ఆ తల్లిని ఓదార్చడం ఎవరితరం కావడం లేదు. వివరాలిలా ఉన్నాయి.. కవిటి మండలం తలగానపుట్టుగ గ్రామానికి చెందిన మదనాల పురుషోత్తం(29) పెద్ద శ్రీరాంపురం సమీపంలో సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వివాహ సమయం దగ్గర పడడంతో సోంపేట మండలం జింకిభద్రలో బంధువులను కలిసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో పెద్ద శ్రీరాంపురం హైస్కూల్ సమీపంలో మాణిక్యపురం వైపు నుంచి ఎదురుగా వస్తున్న లగేజీ వ్యాన్ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో పురుషోత్తం తలకి, భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పురుషోత్తం మంగళవారం ఉదయం మృతి చెందాడు.

## అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు: కిషన్ రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు తెలుపుతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అమరావతి చట్టబద్ధతపై లోక్ సభలో చర్చ జరిగింది. లోక్ సభలో కేంద్ర హోంశాఖ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ ఏర్పడిందని ఆయన అన్నారు. కేంద్రంలోని కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో 1969లో కాంగ్రెస్ పార్టీ 369 మంది ఉద్యమకారులను కాల్చి చంపిందని ఆరోపించారు. జై తెలంగాణ అన్నందుకు విద్యార్థులను కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని మండిపడ్డారు. చివరి దశ తెలంగాణ ఉద్యమంలో కూడా 1200 మంది విద్యార్థులు ఆత్మార్పణ చేసుకున్నారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో నేడు ఏడు ఎయిర్ పోర్టులు ఉన్నాయని, తెలంగాణలో కేవలం ఒకే ఒక్క విమానాశ్రయం ఉందని అన్నారు. దీనికి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యమే కారణమని ఆరోపించారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు పోటీతత్వంతో అభివృద్ధి కావాల్సి ఉందని అన్నారు. విభజన జరిగి పదేళ్లు దాటినా అమరావతిని రాజధానిగా చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## హామీల అమలు కోసం అంగన్‌వాడీల ధర్నా



**కాకినాడ, పతాకం న్యూస్:** కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పలు కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించారు. తక్షణమే వేతనాల పెంపుదల హామీని అమలు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. కాకినాడ స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి పార్టీల అధినేతలు అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని, అధికారం లోకి వచ్చి రెండేళ్ల కావస్తున్నా నేటికీ ఆ హామీని అమలు చేయలేదన్నారు. చర్చల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన పనిచేయడం సరికాదన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని మే నెల మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్య దర్శులు విజయ, రాజేశ్వరి, జిల్లా కోశాధికారి రామ లక్ష్మి, రమణమ్మ, జ్యోతి, బాంధవి, లక్ష్మి పాల్గొ న్నారు. ప్రత్తిపాడు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కనీస వేతనం ఇస్తానన్న హామీను తక్షణమే అమలు చేయా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు కాకపల్లి సునీత, అల్లాడి లక్ష్మీ, కోసాధికారి కె.హేమలత, నాయకులు టి.నాగసత్యవతి, కె.మరియమ్మ, కె.అచ్చిరాజు, సౌజన్య, కె.సూర్యవతి పాల్గొన్నారు. పిఠాపురం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డి.తులసిదేవి, జి.విజయశాంతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, ప్రభావతి, రామలక్ష్మి, రాఘవ, పద్మ, దుర్గభవాని, సత్యవతి, ప్రజా వాణి, నళిని పాల్గొన్నారు. పెద్దాపురం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి ఎస్తేరు రాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు టిఎల్.పద్మావతి, రాష్ట్ర కమిటీ సభ్యులు తలారి నాగమణి, స్నేహలత, విజయ, తులసి, పాపాయమ్మ, భాను, సావిత్రి, లక్ష్మి, రత్నం తదితరులు పాల్గొన్నారు. కాకినాడ రూరల్ స్థానిక ఐసిడిఎస్‌కార్యాలయం అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి టి.రాజా, ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర వేణి, వీరమణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి, భవాని, వరలక్ష్మి, అచ్చారత్నం, తనుజ, అప్పలకొండ, కల్పలత, అనురాధ నారాయణమ్మ, యాపారమ్మ పాల్గొన్నారు. తాళ్ళరేవు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో తాళ్ళరేవు, కాజులూరు మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలి



**పార్వతీపురం, పతాకం న్యూస్:** సీతానగరం మండలంలోని బగ్గందొరవలస దళితులు సాగు చేస్తున్న భూమికి పట్టాదారు పాస్ పుస్తకాలు వెంటనే ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద దళితులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1972లో బగ్గందొర వలస దళితులకు సర్వే నంబర్ 1 నుంచి సర్వే నెంబర్ 1 లో 16 వరకు 15 ఎకరాల 83 సెంట్లు డి పట్టాలు ఇచ్చారన్నారు. అప్పటి నుంచి దళితులు తాతలు దండ్రుల నుంచి సాగు చేసుకుం టున్నారన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు కావాలని వందల సార్లు రెవెన్యూ అధికారులు చుట్టూ తిరిగినా ఇస్తాం... చూద్దాం అని చెప్పి కాలయాపన చేశారు తప్ప ఇవ్వలేదన్నారు. దళితులంతా కలిసి భూములు చదును చేసి సాగు చేసుకుంటూ ఉంటే ఆభూమిని రెవెన్యూ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు అప్పజెప్పడానికి దళితులను బెదిరిస్తున్నారన్నారు. మార్చి 2న జాయింట్ కలెక్టర్‌కు సమస్యను విన్నవించుకోగా, అందుకు ఆయన స్పందిస్తూ భూమిని సాగు చేసుకోండి అని చెప్పారని అన్నారు. అయినా సాగు చేస్తున్న భూముల వద్ద హెచ్చరిక బోర్డు పెట్టి దళితులను భయభ్రాంతులకు గురి చేయడం తహశీల్దార్‌కు తగదన్నారు. సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఈ భూమిని అప్పజెప్ప డానికి ప్రయత్నం చేయడం తగదని ఇప్పటికైనా దళితులు సాగు చేస్తున్న భూములకి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. అనంతరం డిటి ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమం లో సిపిఎం నాయకులు రెడ్డి లక్ష్మనాయుడు, జి.వెంకటరమణ, ఆర్.సత్యనారా యణ, బి.అప్పారావు, సిహెచ్.కృష్ణ, ఎం.నాగరాజు, బాధితులు సూరి, మురళి, పకీర్ను సింహాచలం, అమ్మడమ్మ, సుధా, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం డ్యాం భద్రతను పరిశీలించిన నిపుణుల బృందం




**శ్రీశైలం, పతాకం న్యూస్:** శ్రీశైలం ప్రాజెక్టును నిపుణుల కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. శ్రీశైలం డ్యాం భద్రతను పరిశీలించేందుకు సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) బృందం సభ్యులైన 1. డీకే శర్మ డ్యామ్ ఎక్సపర్ట్ ఛైర్ పర్సన్, 2. గుల్షన్ రాజ్ హైడ్రో మెకానికల్ ఎక్స్పెక్ట్ సభ్యులు 3. టికె.శివరాజన్ డ్యామ్ ఎక్స్పెక్ట్ సభ్యులు 4. జే ఎం.గౌతమ్ జువాలజీ ఎక్స్పర్ట్ సభ్యులు బుధవారం డ్యామ్ వద్దకు చేరుకున్నారు. ముందుగా యు పాయింటు వద్ద డ్యామ్ జలవనరుల శాఖ అధికారులతో క్షేత్ర స్థాయిలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో డ్యాము చీఫ్ ఇంజనీర్ కబీర్ భాష పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డ్యామ్ ప్రస్తుత స్థితిగతులను బృందం సభ్యులకు వివరించారు. ఈ సమావేశము అనంతరము డ్యామ్‌లోని నీటి నిల్వలు, డ్యామ్ పటిష్టత, రేడియల్ క్రస్ట్ గేట్లు, గ్యాలరీ, ప్లంజ్ పూల్ ప్రాంతాలను పరిశీలించారు. తదుపరి పలు అంశాలపై అధ్యయనం చేసిన తర్వాత పూర్తి వివరాలను నేడు వెల్లడించనున్నారు.

# గణనీయంగా పడిపోతున్న 'రూపాయి'!




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఇరాన్‌తో అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభించినప్పటి నుంచీ ఆసియా లోని చాలా దేశాల కరెన్సీల విలువలు డాలర్‌తో పోల్చితే గణనీయంగా పడిపోవడం జరుగుతోంది. అయితే అన్నింటిలోకీ ఎక్కువగా దెబ్బతిన్నది మాత్రం మన రూపాయే. ఫిబ్రవరి 27న ఒక డాలర్ విలువ రూ.91.01. అది కాస్తా మార్చి 20 నాటికి రూ.93.73 అయింది. ఈ పతనానికి తక్షణ కారణం స్పష్టమే. చమురు, సహజ వాయువులను ఎక్కువగా దిగుమతి చేసుకునే దేశం మనది. అందులో ఎక్కువ భాగం హార్ముజ్ జలసంధి మార్గాన రవాణా అవుతుంది. ఆ జలసంధిని ఎప్పుడైతే మూసివేశారో అప్పటి నుంచీ మనకు చమురు, సహజ వాయువుల సరఫరా దెబ్బ తింది. దానికి తోడు ముడి చమురు ధర కూడా పెరిగింది. పైగా మనకు బైట నుండి వచ్చే విదేశీ మారక ప్రవాహం దాదాపు ఆగిపోయింది. మన విదేశీ మారకపు నిల్వల స్థాయిని నిలబెట్టేది బైట నుండి వచ్చే చెల్లింపులే. ఇప్పుడు అవి నిలిచిపోవడంతో మన విదేశీ చెల్లింపుల ఖాతా మీద వత్తిడి బాగా పెరిగింది. ఇది రూపాయి విలువ పడిపోడానికి దోహదం చేసింది. అయితే మన విదేశీ చెల్లింపుల ఖాతా కేవలం మూడు వారాల యుద్ధం పర్యవసానంగా ఇంతగా దెబ్బ తిన్నదా అంటే అదే ప్రధాన కారణం అని భావించకూడదు. మన విదేశీ చెల్లింపుల ఖాతా దెబ్బ తినబోతున్నది అన్న ముందస్తు అంచనాతో మన దేశం నుండి విదేశీ మారకం పెట్టుబడులు బైటకు ప్రవహించడం వలన ఎక్కువగా దెబ్బ తిన్నది. అంతర్జాతీయంగా క్షణాల్లో తరలిపోయే ద్రవ్య పెట్టుబడి యజమానుల ముందస్తు అంచనాలు మన నిల్వల్ని దెబ్బతీశాయి. ముడి చమురు విలువతో పోల్చితే అమెరికన్ డాలర్ విలువ దెబ్బ తినిపోకుండా ఉండేందుకుగాను, అదే ముడిచమురు ఉత్పత్తి చేసే దేశాల మీద దాడి చేస్తున్నది ఆ అమెరికాయే అయినప్పటికీ, అక్కడికే ప్రపంచంలోని ఎక్కడెక్కడ ఉన్న డాలర్ పెట్టుబడుల్నీ తరలించడం జరుగుతోంది. ఇక్కడ వింతల్లోకెల్లా వింత ఏమంటే, ముడి చమురు ధరతో పోల్చితే డాలర్ విలువ పడిపోతున్నప్పుడు, మూడవ ప్రపంచ దేశాల కరెన్సీల విలువలు ఆ డాలర్‌తో పోల్చినప్పుడు పెరగడం పోయి పడిపోతున్నాయి! ఎందుకిలా జరుగుతుంది? ముడి చమురు దిగుమతికి చెల్లించవలసిన మొత్తం ఎప్పుడైతే పెరుగుతుందో, అప్పుడు అలా పెరిగిన ఖర్చుకు తగినట్టు పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచి భారాన్ని ప్రజలమీదకు నెడతారు. ఇలా ధరలు పెరగడం వలన ద్రవ్యోల్బణం పెరుగుతుంది. ద్రవ్యోల్బణం పెరిగినందున మన కరెన్సీ విలువ తగ్గుతుంది. అప్పుడు దాని ప్రభావం కేవలం చమురు ఉత్పత్తుల వరకే పరిమితం కాదు. మనం దిగుమతి చేసుకునే అన్ని సరుకుల ధరలూ పెరుగుతాయి. ఎందుకంటే ఆ లావాదేవీలన్నీ డాలర్లలోనే జరుగుతాయి. చమురు ధర డాలర్లలో కూడా పెరుగుతుంది కాబట్టి అమెరికాలో కూడా ద్రవ్యోల్బణం పెరుగుతుంది. కాని అమెరికాలో పెరిగే ద్రవ్యోల్బణం కన్నా అధికంగా మూడవ ప్రపంచ దేశాల్లో మరిన్ని రెట్లు ఎక్కువ పెరుగుతుంది. మన ఇతర దిగుమతులు కూడా డాలర్ కరెన్సీలోనే జరుగుతాయి కనుక ఇలా జరుగుతుంది.

రిజర్వు బ్యాంక్ తన వద్దనున్న నిల్వల నుండి గత మూడు వారాల్లో ఏకంగా 2000 కోట్ల డాలర్ల మేరకు మార్కెట్ లోకి విడుదల చేసి రూపాయి విలువ పడిపోకుండా నిలబెట్టడానికి ప్రయత్నించింది. అయినప్పటికీ, మన రూపాయి విలువ పడిపోతుందన్న అంచనాలు ఎంత బలంగా పని చేశాయంటే, ఇంత పెద్ద ఎత్తున విడుదల చేసిన నిల్వలు కూడా రూపాయి పతనాన్ని అడ్డుకోలేకపోయాయి. బహుశా ఇలా నిల్వలను విడుదల చేయకపోయి వుంటే ఈ పతనం ఇంకా ఎక్కువ మోతాదులో ఉండేది. దీనిని బట్టి మార్కెట్‌లో స్పెక్యులేటర్ల ముందస్తు అంచనాల ప్రభావం ఎంత బలంగా పని చేస్తుందో మనకు తెలుస్తోంది. నిజానికి ఇరాన్ యుద్ధం మొదలు కాకముందే ఈ ముందస్తు అంచనాల ప్రభావం పని చేయడం మొదలైంది. జనవరి 1న 89.94 ఉన్న రూపాయి విలువ ఫిబ్రవరి 27 నాటికి 91.01కి పడిపోయింది. రెండు నెలల్లో ఇది జరిగింది. ఇరాన్ యుద్ధం మొదలయ్యాక పెరిగిన చమురు ధరల ప్రభావం అదనంగా తోడై మూడు వారాల్లోనే 93.73కి పడిపోయింది. "సురక్షిత" ప్రాంతానికి తమ డాలర్ నిల్వలను తరలించుకుపోవాలన్న ఇన్వెస్టర్ల తాపత్రయం ఈ క్రమాన్ని మరింత వేగవంతం చేస్తోంది. విశ్లేషకులైతే ఈ పతనం కొనసాగి రూపాయి విలువ 95 కన్నా దిగువకు చేరుతుందని అంచనాలు వేస్తున్నారు. మన రిజర్వు బ్యాంక్ దగ్గర 70,000 కోట్ల డాలర్ల నిల్వ ఉన్నప్పటికీ రూపాయి పరిస్థితి ఇలా ఉంది. అంటే విదేశీ మారకపు నిల్వలు మన రిజర్వు బ్యాంక్ దగ్గర భారీగా ఉన్నా అవేవీ రూపాయి విలువ పతనాన్ని అడ్డుకోలేకపోతున్నాయని కనిపిస్తోంది. ఆ నిల్వల నుండి భారీగా మార్కెట్ లోకి డాలర్లను విడుదల చేసి రూపాయి విలువ పడిపోకుండా ఆపాలని రిజర్వు బ్యాంక్ ప్రయత్నించింది. కాని ఇంత భారీ నిల్వలను విడుదల చేస్తోందంటే రూపాయి విలువ రాబోయే రోజుల్లో ఇంకా పడిపోనుంది అన్న ముందస్తు అంచనాలు ఇన్వెస్టర్లలో మరింత బలపడ్డాయి. దాంతో ఇప్పుడు రిజర్వు బ్యాంక్ ఇక ముందు నిల్వల విడుదల చేసే విషయంలో పునరాలోచన చేస్తోంది. విదేశీ మారకపు నిల్వలను రుణ వాయిదాల చెల్లింపునకు, లేదా విదేశీ చెల్లింపుల ఖాతాలో లోటు ఏర్పడితే దానిని భర్తీ చేయడానికి విడుదల చేయడం ఉపయోగకరంగా ఉంటుంది. అంతేతప్ప ఇన్వెస్టర్ల అంచనాలు ఈ విధంగా ప్రతికూలంగా ఉన్నప్పుడు రూపాయి విలువ పతనాన్ని అడ్డుకోడానికి నిల్వలను ఖర్చు చేయడం వల్ల ఉపయోగం ఉండదు. మన విదేశీ వ్యాపారపు లావాదేవీలలో సమకూర్చుకున్న మిగులుతో మన విదేశీ మారకపు నిల్వలలో ప్రధాన భాగం ఏర్పడినట్టైతే దాని మీద దేశం చెల్లించే వడ్డీ రేటు తక్కువగా ఉంటుంది. అదే విదేశాల నుండి ద్రవ్య పెట్టుబడి ప్రవాహం రూపంలో వచ్చిన దాంతో ప్రధానంగా మన నిల్వలు ఏర్పడితే వాటికి చెల్లించే వడ్డీ రేటు ఎక్కువగా ఉంటుంది. ఇప్పుడు మన రిజర్వు బ్యాంక్ దగ్గరున్న డాలర్ నిల్వల నుండి బ్యాంక్‌కి వచ్చే వడ్డీ రేటు 1.5 శాతానికి మించదు. అదే బైట నుండి వచ్చే డాలర్ పెట్టుబడులకు వడ్డీ 7 నుండి 8 శాతం వరకూ చెల్లిస్తున్నారు. అంటే ఎక్కువ వడ్డీకి అప్పు తెచ్చి తక్కువ వడ్డీకి అప్పులిచ్చినట్లు అవుతోంది! ఇటువంటి నిల్వలు ఎంత ఎక్కువ ఉంటే మన దేశానికి అంత భారమే అవుతుంది తప్ప బలం కాజాలదు. ఇలా అప్పులు చేసి విదేశీ నిల్వలను సమకూర్చుకునే విధానం నయా ఉదారవాద విధానాల అమలులో అంతర్భాగమే. ఇందులో సుంకాల ఆంక్షలు కాని, దిగుమతి చేసుకునే సరుకుల పరిమాణం మీద కాని ప్రభుత్వం ఎటువంటి ఆంక్షలూ విధించకూడదని నయా ఉదారవాదం పట్టుబడుతుంది. ద్రవ్య పెట్టుబడి తన ఇష్టం వచ్చిన రీతిలో దేశంలోకి రావడానికి, పోడానికి ఎటువంటి ఆటంకాలూ ఉండకూడదని నిర్దేశిస్తుంది. అందుచేత మన రూపాయి విలువ కొద్దిమంది అంతర్జాతీయ ఫైనాన్సు మదుపుదారుల అపరిమిత లాభాపేక్షకు బలౌతుంది. రూపాయి విలువతో బాటు కోట్లాది శ్రామిక ప్రజల జీవితాలు కూడా బలౌతూ వుంటాయి. ఈ హానికర పర్యవసానాలు ప్రస్తుతం మన కళ్ళెదుట మన దేశంలో జరుగుతున్నాయి.అయితే, ఇటువంటి నయా ఉదారవాద పెత్తనం బారి నుంచి బైట పడే పెద్ద అవకాశాలు కూడా ప్రస్తుత పరిణామాలు కల్పిస్తున్నాయి. సుంకాలను పెంచకూడదన్న నిబంధనను డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ఉల్లంఘించాడు కాబట్టి మన దేశం కూడా మనకు తగిన రీతిలో సుంకాలను విధించవచ్చు. అప్పుడు విదేశీ వ్యాపారంలో లోటు పెరగకుండా సర్దుబాటు చేసుకోవచ్చు. అంతే కాదు. ఇప్పుడు అమెరికా చాలా ఎక్కువ దేశాల మీద ఆంక్షలు విధించింది. ఇలా ఆంక్షలకు గురైన దేశాలన్నీ కూడబలుక్కుని ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కాని, బహుళపక్ష ఒప్పందాలు కాని వాటిలో అవి కుదుర్చుకోగలిగితే, అది కూడా డాలర్ కొలబద్ద లేకుండా కుదుర్చుకోగలిగితే ఇక డాలర్ల మీద ఆధారపడవలసిన అవసరం లేకుండా పోతుంది. వీలైతే ఇటువంటి ఒప్పందాల్లో సరుకుల విలువల ప్రాతిపదికన ఇచ్చిపుచ్చుకునే విధానాలను, ఒక ఏడాదిలో వాణిజ్య లోటును వచ్చే ఏడాదిలో సర్దుబాటు చేసుకునే విధానాన్ని అమలు చేస్తే ఇంకా ప్రయోజనకరం. ఇలా డాలర్ల అవసరం లేని అంతర్జాతీయ వాణిజ్యం చేపడితే అప్పుడు డాలర్ నిల్వలను భారీగా సమకూర్చుకోవలసిన అవసరం లేకుండా పోతుంది. ఆ నిల్వల కోసం అంతర్జాతీయ స్పెక్యులేటర్ల మీద ఆధారపడవలసిన అగత్యమూ ఉండదు. అప్పుడు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశాలకు తలవొగ్గవలసిన అవసరమూ ఉండదు. కాని మోడీ ప్రభుత్వం మాత్రం ఇందుకు పూర్తిగా భిన్నమైన రూటులో నడుస్తోంది. ఈ సమయంలోనే మోడీ ప్రభుత్వం చాలా దేశాలతో వరుస పెట్టి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల మీద సంతకాలు చేసేస్తోంది. వాటి వలన మన విదేశీ వాణిజ్యం పెరగవచ్చు. కాని నికరంగా మన ఎగుమతులు పెరిగే అవకాశాలైతే లేవు.

# ఎన్టీఆర్ వైద్య సేవకు బ్రేక్.. ఆందోళనలో రోగులు

**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** జిల్లాలో ఎన్‌టిఆర్ వైద్య సేవలకు నేటి నుంచి బ్రేక్ పడనుంది. ఈ మేరకు ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) రాష్ట్ర ప్రభుత్వానికి తేల్చి చెప్పింది. ఈ మేరకు జిల్లాలోని ఆసుపత్రుల యాజమాన్యాలు సైతం సిద్ధం కావడంతో రద్దీ పెరిగింది. ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రుల్లోని ఎన్‌టిఆర్ వైద్య మిత్రల వద్ద రోగులు బారులు తీరారు. అత్యధిక మంది అడ్మిషన్లు కోసం వచ్చినట్లు ఆరోగ్య మిత్రలు చెబుతున్నారు. కొన్ని నెలలుగా బకాయిలు చెల్లించాలంటూ నెట్ వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రభుత్వాన్ని కోరినప్పటికీ సానుకూలంగా స్పందించకపోవటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆషా తెలిపింది. వారి నిర్ణయంతో పేదల ఆరోగ్య భద్రత ప్రశ్నార్థకంగా మారనుంది. జిల్లాలో ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకం ద్వారా 90 నెట్‌వర్క్ ఆసుత్రులు రోగులకు సేవలందిస్తున్నాయి. వాటిలో 36 ప్రభుత్వ యాజమాన్య ఆస్పత్రులుకాగా, 39 ప్రయివేటు ఆసుపత్రులు, 15 ఇహెచ్‌ఎస్ ఆసుపత్రులు ఉన్నాయి. వీటిలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 3,255 రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎన్‌టిఆర్ వైద్య సేవగా పేరు మాత్రం మార్చింది. కాని బకాయిల చెల్లింపును తాత్సారం చేస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో బిల్లు బకాయిలపై ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) ఇప్పటికే పలు మార్లు విన్నవించుకున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆసుపత్రుల నిర్వహణ భారంగా మారిందని వైద్యులకు, సిబ్బందికి జీతాలు ఇవ్వలేకపోతున్నామని, అప్పులు చేసి సేవలందించాల్సి వస్తుందన్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు ఆసుపత్రులకు ఒక్కో ఆసుత్రికి కనిష్టంగా రూ.3 కోట్ల నుంచి గరిష్టంగా రూ.15 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.150 నుంచి రూ.200 కోట్ల వరకూ బకాయిలు



ఉన్నాయి. జిల్లాలో 90 శాతం ఆరోగ్యశ్రీ కేసులు జిల్లా కేంద్రానికే వస్తున్నాయి. అందులో ఎక్కువగా ఆర్థో, న్యూరాలజీ, యూరాలజీ, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్ కేసులు ఉంటున్నాయి. కొన్ని ఆసుపత్రుల్లో స్పెషాలిటీ డాక్టర్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. ఇందులో గైనిక్, జనరల్ సర్జరీ కేసులు మాత్రం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వస్తుండగా, పిడియాట్రిక్ కేసులను ప్రయివేటుకు రిఫర్ చేస్తున్నారు. గుండెకు సంబంధించిన కేసుల్లో సగానికిపైగా నగరంలోని ఒక ప్రముఖ ఆసుత్రికే రిఫర్ చేస్తున్నారు. నెట్ వర్క్ ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్య సేవ నిలుపుదల చేయటంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. జిల్లాలో 10 లక్షల వరకూ ఎన్‌టిఆర్ వైద్యసేవా కార్డులున్నాయి. ఇప్పటికే ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్లుగా ఉన్న వారికి ఆరోగ్యశ్రీ వర్తిస్తుందా లేదా? అనే భయం వెంటాడుతోంది. జిల్లాలో ఇన్‌పేషెంట్లుగా ఇప్పటికే సుమారు వెయ్యి మందికిపైగా ఉన్నట్లు సమాచారం. ఆరోగ్యశ్రీ స్థానంలో యూనివర్శల్ హెల్త్ పాలసీ తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతుంది. పేదలకు వైద్యం రూ. 2లక్షల వరకూ ఆయుష్మాన్ భారత్‌లోనూ, ఆపై బీమా కంపెనీల ద్వారా వైద్యం అందించాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. ఎన్‌టిఆర్ వైద్య సేవతో పోల్చితే బీమా సంస్థల పరిధిలో 1,900లకు మించి సేవలు లేవు. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకోవటంతో పేదలకు భవిష్యత్తులో ఆరోగ్య భద్రత దూరం కానుంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించి ఎన్‌టిఆర్ వైద్య సేవ అందుబాటులోకి తీసుకురావాలని రోగులు కోరుతున్నారు.

## క్రైస్తవ మతంలోకి మారితే వారి ఎస్సీ హోదాను రద్దు చేయడం తగదు




**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** దళితులు క్రైస్తవ మతంలోకి మారితే వారి ఎస్సీ హోదాను రద్దు చేయాలనే భావనకు బలం చేకూర్చే విధంగా ఇటీవల వెలువడిన సుప్రీంకోర్టు తీర్పును పున్ణసమీక్ష చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం జిల్లా కమిటీ సమావేశం పార్టీ కార్యాలయంలో జువ్వల రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడారు. ఈ తీర్పు దేశంలోని దళితుల మౌలిక హక్కులపై ప్రత్యక్ష దాడిగా భావించాలన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే రాజ్యాంగ ధర్మాసనానికి అప్పీల్ చేసి, ఈ తీర్పుపై పున:సమీక్ష జరగేలా చర్యలు తీసుకోవాలన్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులను కల్పించిందన్నారు. ముఖ్యంగా ఆర్టికల్ 14 సమానత్వాన్ని, ఆర్టికల్ 15 మతం, కులం ఆధారంగా వివక్షను నిషేధిస్తుందన్నారు. అలాగే ఆర్టికల్ 17 అంటరానితనాన్ని నిర్మూలిస్తూ దళితుల గౌరవాన్ని కాపాడుతుందన్నారు. ఆర్టికల్ 25 ప్రతి వ్యక్తికి తనకు ఇష్టమైన మతాన్ని అనుసరించే స్వేచ్ఛను స్పష్టంగా కల్పించిందన్నారు. ఈ రాజ్యాంగ హక్కులను పక్కనబెట్టి, కేవలం దళితులు మతం మారితే వారి సామాజిక హక్కులను తగ్గించడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమైన చర్య అన్నారు. దేశంలో దళితులపై వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్ల తర్వాత కూడా దళితులు, ఆదివాసీలపై సామాజికంగా, ఆర్థికంగా అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. అనేక ప్రాంతాల్లో దేవాలయాల్లోకి దళితుల ప్రవేశాన్ని నిరాకరించడం, సామాజికంగా వేరుచేయడం, దాడులు జరగడం వంటి ఘటనలు నిత్యకృత్యాలుగా మారాయన్నారు. ఈ పరిస్థితుల కారణంగానే చాలా మంది దళితులు గౌరవప్రదమైన జీవితం కోసం క్రైస్తవం, బౌద్ధం వంటి మతాల్లోకి మారాల్సి వస్తోంది. ఇది వారి హక్కు అని దాన్ని ఎవరూ నిరకరించలేరన్నారు.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్వయంగా హిందూ మతంలోని మనుధర్మ శాస్త్రాన్ని తీవ్రంగా విమర్శించారన్నారు. దళితులపై జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ ఆయన లక్షలాది మందితో కలిసి బౌద్ధమతాన్ని స్వీకరించారని గుర్తు చేశారు. ఈ చారిత్రక సంఘటనను మరిచిపోవడం, దళితుల మత స్వేచ్ఛను ప్రశ్నించడం అనేది దేశ చరిత్రను అవమానించడం వంటిదేనన్నారు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన ఘటనలు కూడా దళితులపై కొనసాగుతున్న వివక్షకు ఉదాహరణ అన్నారు.

## మహిళా చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి



**చిత్తూరు, పతాకం న్యూస్:** బాల్యవివాహ నిరోధక చట్టం, పాక్సో చట్టం, హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగం, శక్తి యాప్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించిన చిత్తూరు జిల్లా శక్తీ టీం పోలీసులు. ఆర్.కె జూనియర్ కాలేజీ నందు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గారు మాట్లాడుతూ, మీరంతా భవిష్యత్తు పౌరులు. అందుకే చిన్న వయసులోనే మీకు మంచి--చెడు తెలిసేలా అవగాహన కలిగి ఉండటం చాలా అవసరం.బాల్యవివాహం ఒక పెద్ద సమస్య. బాలికలు 18 సంవత్సరాలు పూర్తిచేయక ముందే పెళ్లి జరపడం చట్ట విరుద్ధం. చిన్న వయసులో పెళ్లి చేస్తే చదువు ఆగిపోవడం, ఆరోగ్య సమస్యలు రావడం, భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. అందుకే మీరు చదువులో ముందుకు వెళ్లి, జీవితాన్ని సక్రమంగా తీర్చిదిద్దుకోవాలి.పోక్సో చట్టం చాలా కఠినమైనది. 18 సంవత్సరాల లోపు పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులు జరిగితే దానికి కఠినమైన శిక్షలు ఉంటాయి. ఇలాంటి సంఘటన ఎప్పుడైనా ఎదురైతే భయపడకుండా పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు మరియు ఉపాధ్యాయ సిబ్బంది మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మెస్ వర్కర్స్ యూనియన్ రిలే నిరాహార దీక్ష

**కాకినాడ, పతాకం న్యూస్:** ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి రంగరాయ వైద్య కళాశాలలో సెక్యూరిటీ సేవలందిస్తున్న కార్మికులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు పెంచాలని, క్యాజువల్ లీవులు అమలు చేయాలని, అక్రమంగా విధులకు దూరం చేసిన గార్డ్స్ ని డ్యూటీలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ .... సిఐటియు ఆధ్వర్యంలో జిజిహెచ్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద మార్చి 25 న ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు 8వ రోజైన బుధవారం కూడా నిర్వహించారు. జిజిహెచ్ మెస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఏసూరి శంకర్ దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .... జిజిహెచ్ లో సెక్యూరిటీ గార్డ్స్ కి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం దిగి వచ్చేవరకు సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగించాలన్నారు. అవసరమైతే జిజిహెచ్ మెస్ వర్కర్స్ సభ్యులు ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామన్నారు.

## వంట గ్యాస్ కోసం సీపీఎం ధర్నా




**కాకినాడ, పతాకం న్యూస్:** వంటగ్యాస్ కొరత లేకుండా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ధర్నా చేపట్టింది. కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు మాట్లాడారు. ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధం వల్ల గ్యాస్ కొరత ఏర్పడి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కమర్షియల్ గ్యాస్ ధర పెరగడం, సరఫరా నిలిచిపోవడం వల్ల చిన్న చిన్న వ్యాపారులు షాపులు మూసివేశారని తెలిపారు. దీనివల్ల సామాన్య ప్రజలు ఆహారం కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణ గోదావరి బేసిన్ డి6 బ్లాక్‌లో పుష్కలంగా ఆయిల్, గ్యాస్ నిక్షేపాలు తవ్వుతున్నారని, గుజరాత్ మహారాష్ట్రానికి తరలిస్తున్నారని తెలిపారు. ఆ ఉత్పత్తిలో సగం మన రాష్ట్ర అవసరాలకు కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దువ్వ శేషబాబ్జి, సిహెచ్.రాజ్ కుమార్, టేకుమూడి ఈశ్వరరావు, ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమెరికాకు లొంగుబాటు వైఖరి ప్రదర్శించడం దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తుందన్నారు. ఇరాన్‌తో పాటు మన సరిహద్దు దేశాలతో కేంద్ర ప్రభుత్వం సత్సంబంధాలు కొనసాగిస్తే దేశానికి మేలు జరుగుతుందన్నారు. అలీన విదేశాంగ విధానం గత చాలా కాలంగా మన దేశం అనుసరిస్తుందని తెలిపారు. కేంద్రంలో మోఢ అధికారం చేపట్టిన తర్వాత అమెరికాకు లొంగి పోవడమే కాకుండా ఇజ్రాయిల్ వంటి దురాక్రమణ దేశానికి మద్దతు ప్రకటించడం దేశ ప్రతిష్టను దిగజారుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమెరికా షరతులు వ్యతిరేకించి దేశ ప్రయోజనాల కోసం నిలబడాలన్నారు. వంటగ్యాస్ సరఫరా కొరత లేకుండా చూడాలని, చిరు వ్యాపారం ఆదుకోవాలని, చిరు వ్యాపారులకు ఇచ్చిన ముద్ర రుణాలపై మారటోరియం విధించాలన్నారు. కృష్ణా గోదావరి బేసిన్ ఉత్పత్తిలో సగం వాటా మన రాష్ట్రానికి కేటాయిస్తే వంటగ్యాస్ సిలిండర్ రూ.300 రూపాయలకే వినియోగదారులకు అందించే అవకాశం ఉందన్నారు. ధర్నా అనంతరం డిఆర్ఓ తిప్పేనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర్ కన్వీనర్ పలివెల వీరబాబు, జిల్లా కమిటీ సభ్యుడు కెఎస్.శ్రీనివాస్, నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, సూరిబాబు, రూరల్ కమిటీ సభ్యులు టి. రాజా, సిహెచ్.అజరు, చంద్రమళ్ళ పద్మ, టి.రాణి, అంకం సుబ్రహ్మణ్యం, కె.వీరబాబు, కె.సింహాచలం, యు.సత్యనారాయణ, రాజా బాబు, విజరుకుమార్, పి.దుర్గాప్రసాద్, సత్యం పాల్గొన్నారు.

# మెనోపాజ్ తర్వాత సమస్యలు రాకుండా ఉండాలంటే ..!

మెనోపాజ్ అనేది ఆడవారిలో సహజంగానే వచ్చే మార్పు. వారికి 45 నుంచి 55 ఏళ్ల మధ్యలో ఎప్పుడైనా పీరియడ్స్ ఆగిపోతాయి. పొగాకు తాగేవారికి ముందుగానే రావొచ్చు. అయితే, కొన్ని కారణాలతో అండశయాలు, కొన్ని రకాల కీమో థెరపీలని తొలగించే సర్జరీలను ఉన్నాయి. శారీరక స్థాయిలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ హార్మోన్ల అండాశయాల ఉత్పత్తి తగ్గడం వల్ల పీరియడ్స్ ఆగిపోతాయి. సాధారణంగా అవసరం లేనప్పటికీ, రక్తం, మూత్రంలో హార్మోన్ స్థాయిలను కొలవడం ద్వారా మెనోపాజ్‌ని గుర్తించొచ్చు. మెనోపాజ్ వచ్చే ముందు వారి పీరియడ్స్‌లో మార్పులు ఉంటాయి. అంటే పీరియడ్స్ త్వరత్వరగా రావొచ్చు. లేదా ఎక్కువ సమయానికి రావొచ్చు. ఈ సమయంలో మహిళలకి వేడిగా అనిపించడం, రాత్రుళ్ళు చెమటలు పట్టడం, చర్మం ఎర్రబడడం శరీరం నుంచి వేడివేడి సెగలు రావడం, యోని పొడిబారడం, నిద్ర సమస్యల, మానసిక సమస్యల వంటివి ఉండొచ్చు. సాధారణంగా ఆడవారి శరీర తీరు, వారు పాటించే ఆరోగ్య అలవాట్లను బట్టి ఈ పరిస్థితులు మారతాయి.

మెనోపాజ్ వచ్చే ముందు కొన్ని లక్షణాలు:

ఒత్తిడి
ఆందోళన
మానసిక సమస్యలు
రాత్రుళ్ళు నిద్రపట్టకపోవడం
యోని పొడిబారడం
పొత్తికడుపులో నొప్పి
ఇలాంటి లక్షణాలు ఉంటాయి.

సాధారణంగా 45 ఏళ్ల సమీపంలోని స్త్రీకి పీరియడ్స్ ఓ సంవత్సరం పీరియడ్స్



ఆగిపోయినప్పుడు ఈ సమస్య వస్తుంది. కొంతమందికి 47 నుంచి 54 సంవత్సరాల మధ్య ఎప్పుడైనా ఈ సమస్య వస్తుంది. కొన్ని డేటా ప్రకారం, 95 శాతం కంటే ఎక్కువ మంది స్త్రీలకి 44 నుంచి 56 సంవత్సరాల మధ్య మెనోపాజ్ వస్తుంది. 40 కంటే తక్కువ వయసు ఉన్న స్త్రీలలో 2 శాతం, 40 నుంచి 45 వయసున్న స్త్రీలకి 5 శాతం, 55 నుంచి 58 సంవ్తసరాల మధ్య ఉన్నవారికి 5 శాతం మందికి మెనోపాజ్ వచ్చే అవకాశం ఉంది. ఇది దేశాలను బట్టి కూడా మారుతుంటుంది.

అతికొద్దీ మందికి స్త్రీ అండాశాయాలు చిన్న వయసులోనే పనిచేయవు. ఇది యుక్తవయసు నుండి 40 సంవత్సరాల వరకూ ఎప్పుడైనా కావొచ్చు. దీనిని అకాల అండాశయ లోపం అంటారు. దీని వల్ల స్త్రీల ఆరోగ్యం ఎఫెక్ట్ అవుతుంది.

అకాల అండాశయ లోపం ఆటో ఇమ్యూన్ కావొచ్చు. అందువల్ల థైరాయిడ్, డయాబెటిస్ మెల్లిటస్ వంటి ఇతర సమస్యలతో కూడా కలిసి రావొచ్చు. దీనికి కీమోథెరపీ, రేడియోథెరపీ వంటివి కారణమవ్వొచ్చు. కొన్నిసార్లు సిగరెట్ స్మోకింగ్, స్మోకింగ్, అనారోగ్యాల కారణంగా గర్భాశయం తొలగింపు ఉంటుంది. కొంతమంది కవలకి ఒకేలాంటి మెనోపాజ్ ఉండే అవకాశం ఉంది. ఇది దాదాపు 5 శాతం ఉంటుంది. నిజానికీ మెనోపాజ్ అనేది సహజ మార్పు. సాధారణంగా ఇదో సమస్య కాదు. సహజ క్షీణత, వృద్ధాప్యం. ఈ సమస్య గురించి స్త్రీలందరికీ అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వారు ముందు నుంచీ సరైన ఆహారం తీసుకుంటూ మంచి డైట్ ఫాలో అయి వర్కౌట్ చేయడం వల్ల మెనోపాజ్‌లో వచ్చే సమస్యలు అంతగా ఇబ్బంది పెట్టవు. దీని గురించి ముందుగానే డాక్టర్స్‌ని కలిసి వారి సలహాలు తీసుకోవడం మంచిది. మెనోపాజ్ దాటిన మహిళల్లో గుండె జబ్బుల ముప్పు ఎక్కువగా ఉంటే.. ఎముకలు విరిగే ప్రమాదం కూడా గణనీయంగా పెరుగు తుందని పరిశోధకులు చెబుతున్నారు. ట్యూలేన్ విశ్వవిద్యాలయం జరిపిన తాజా అధ్యయనంలో ఈ విషయాన్ని తేల్చారు. గుండె జబ్బులు-ఎముకల సాంద్రత మధ్య ఉన్న లోతైన సంబంధాన్ని బయటపెట్టారు. మెనోపాజ్ తర్వాత ఈస్ట్రోజన్ హార్మోన్ తగ్గడం వల్ల.. మహిళల్లో గుండె సమస్యలు, ఎముకల బలహీనత రెండూ పెరిగే అవకాశం ఉంటుందని వెల్లడించారు. ధమనుల గోడలు గట్టిపడటం వంటి సమస్యలు ఉన్నవారిలో ఎముకల సాంద్రత త్వరగా తగ్గుతుందని వెల్లడించారు. మెనోపాజ్ దశలో ఉన్న మహిళలు తమ ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలనూ వివరించారు. ఎముకల పటుత్వం కోసం క్యాల్షియం, విటమిన్ డి అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. నడక, వెయిట్ బేరింగ్ లాంటి వ్యాయామాలు గుండెతోపాటు ఎముకల ఆరోగ్యానికీ భరోసా ఇస్తాయి. కాబట్టి, వీటిని క్రమం తప్పకుండా చేస్తుండాలి. గుండె సంబంధిత పరీక్షలతో పాటు, ఎముకల సాంద్రతను కొలిచే పరీక్షలను రెగ్యులర్‌గా చేయించుకోవడం మంచిది. ఆహారంలో సోడియం తగ్గించి, పీచు పదార్థం ఎక్కువగా ఉండేలా చేసుకోవాలి. దీనివల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. గుండె ఆరోగ్యంపై దృష్టి పెడితే.. పరోక్షంగా ఎముకల ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

# భారీగా పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పశ్చిమాసియా యుద్ధం కారణంగా పెరుగుతున్న చమురు ధరల ప్రభావం భారత్‌పై పడుతోంది. వాణిజ్య వినియోగానికి సంబంధించిన 19 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధరలను ప్రభుత్వ చమురు సంస్థలు భారీగా పెంచాయి. సిలిండర్‌పై రూ.195.50 మేర పెంచాయి. అయితే ఈ పెంచిన ధరలు బుధవారం నుంచి అమల్లోకి వస్తాయి. అయితే గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) వెబ్‌సైట్ ప్రకారం, దిల్లీలో 19 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.195.50 పెరిగి రూ.2,078.50కు చేరింది. కోల్‌కతాలో మరింతగా రూ.218 పెంపు నమోదైంది. గత మార్చి 1న కూడా వాణిజ్య సిలిండర్‌పై రూ.114.50 పెరిగింది. ఈ ధరల పెంపు ప్రధానంగా హోటళ్లు, రెస్టారెంట్లు, పరిశ్రమలపై ప్రభావం చూపనుంది. వాణిజ్య రంగానికి చెందిన వ్యయాలు పెరగడంతో ఆహార పదార్థాల ధరలు కూడా పెరిగే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు. ఇదే సమయంలో 5 కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్ ధర రూ.51 పెరిగి రూ.549కు చేరింది. అయితే గృహ వినియోగదారులకు ప్రస్తుతం ఎలాంటి మార్పులు చేయలేదు. 14.2 కిలోల గృహ వంటగ్యాస్ సిలిండర్ ధర దిల్లీలో రూ.913గానే కొనసాగుతోంది. మార్చి 7న రూ.60 పెంపు తర్వాత ఇది స్థిరంగా ఉంది. ఇక దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల్లో మార్పు లేదు. దిల్లీలో పెట్రోల్ లీటరు రూ.94.72, డీజిల్ రూ.87.62 వద్ద కొనసాగుతున్నాయి. గత ఏడాది మార్చిలో తగ్గింపు తర్వాత ఇవి స్థిరంగా ఉన్నాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్, హిందూస్తాన్ పెట్రోలియంవంటి ప్రభుత్వ చమురు సంస్థలు ప్రతి నెల మొదటి తేదీన అంతర్జాతీయ మార్కెట్ ధరలు, కరెన్సీ మార్పిడి రేట్ల ఆధారంగా ధరలను సవరించాయి.

# గృహ నిర్మాణదారులపై భారం

## భారీగా పెరిగిన మెటీరియల్ ధరలు



**అమరావతి, పతాకం న్యూస్:** ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయిల్ చేస్తోన్న యుద్ధ ప్రభావం గృహ నిర్మాణ రంగంపైనా పడింది. రంగులు, టైల్స్, ఉపకరణాలు, పివిసి పైపుల ధరలు భారీగా పెరిగాయి. పెట్రోలియం ఉత్పత్తుల బై ప్రొడెక్టులతో వీటిని తయారు చేస్తారు. యుద్ధం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక డీజిల్‌పై లీటర్‌కు రూ.22 పెంచింది. గృహ నిర్మాణాల్లో అత్యంత కీలకంగా ఉపయోగించే పెట్రోలియం అనుబంధ ప్లాస్టిక్ ఉత్పత్తుల ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు, సొంతంగా ఇళ్లు నిర్మించుకుంటున్న వారు, బిల్డర్లు ఆందోళన చెందుతున్నారు. ఆయా పరికరాల కొనుగోలుకు గృహ నిర్మాణదారులు వెనుకాడడంతో అమ్మకాలు తగ్గాయని వ్యాపారులు చెప్తున్నారు. రెండు వారాల్లో పది అడుగుల పొడవు, అంగుళం వ్యాసార్థం ఉన్న పివిసి పైపు ధర రూ.50 నుంచి రూ.70కు, 20 అడుగుల పొడవు, నాలుగు అంగుళాల డ్రెయినేజీ పైపు రూ.740 నుంచి రూ.1150కు, పివిసి పైపులకు ఉపయోగించే ఎల్‌బోలు, బెండ్‌లు, బాక్స్‌లు 60 శాతం వరకు, ఆరు యాంప్స్ స్విచ్ రూ.22 నుంచి రూ.28కు, ఎలక్ట్రికల్ కేబుల్స్ (వైర్ కాయల్) ధర రూ.1,750 నుంచి రూ.2,100కు పెరిగింది. నాలుగు లీటర్ల పెయింట్ డబ్బా రూ.1,100 నుంచి రూ.1,200కు, తిన్నర్ (కర్పంటాయిల్) లీటరు రూ.100 నుంచి రూ.125కు చేరుకుంది. చెక్క పాలిష్ వేయడానికి అవసరమైన తిన్నర్ సరఫరాను కంపెనీలు నిలిపివేశాయి. డీలర్లకు స్టాక్‌లేదని కంపెనీలు చెబుతున్నాయి. ఏప్రిల్ ఒకటి నుంచి రంగులు, టిన్నర్ తదితరాల ధరలు మరో 15 శాతం వరకు పెంచుతున్నట్లు ఆయా కంపెనీల నుండి సెల్ ఫోన్లకు సందేశాలు వచ్చాయని వ్యాపారులు చెబుతున్నారు. గృహ నిర్మాణానికి ఉపయోగించే వివిధ రకాల మెరిటీయల్ ధరలు యుద్ధం వల్ల 20 శాతం వరకు పెరిగాయి. దీనికి ముందే ఇనుము ధర టన్ను రూ.63 వేల నుంచి రూ.75 వేలకు పెరిగింది. ప్రస్తుతం రూ.78 వేలకు చేరుకుంది. దీంతో, గృహ నిర్మాణం భారంగా మారింది. కృష్ణా జిల్లాలో 16,511 మందికి వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద గృహాలు మంజూరయ్యాయి. 400 మంది లబ్ధిదారులు ఉగాదికి గృహ నిర్మాణాలు పూర్తి చేశారు. మరో 16,111 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రభుత్వ గృహ పథకం కింద 300 చదరపు అడుగుల్లో నిర్మించుకునే గృహానికి రెండు వేల కిలోల ఇనుము, వెయ్యి చదరపు అడుగుల్లో డబుల్ బెడ్‌రూమ్ గృహ నిర్మాణానికి ఐదు వేల కిలోల ఇనుము అవసరం. గతంతో పోలిస్తే 300 చదరపు అడుగుల్లో నిర్మాణం చేపట్టిన వారు రూ.30 వేలు, వెయ్యి చదరపు అడుగుల్లో గృహ నిర్మాణం చేపట్టిన వారు రూ.75 వేలు అదనంగా ఐరన్ కొనుగోలుకే ఖర్చు చేయాల్సి వస్తోంది. పెరిగిన విద్యుత్ ఉపకరణాలు, రంగులు తదితరాల ఖర్చులన్నీ కలుపుకుంటే లబ్ధిదారులపై రూ.50 వేలు, వ్యక్తిగతంగా గృహాలు నిర్మించుకునేవారిపై రూఫ్ సీలింగ్‌తో కలిపి రూ.4 లక్షల వరకు అదనపు భారం పడుతోందని చెబుతున్నారు.




# పంజాబ్ కింగ్స్ విజయం



పూర్తి ఏకపక్షంగా సాగుతున్న ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్–గుజరాత్ టైటాన్స్ మ్యాచ్ అభిమానులకు మజా అందించింది. బ్యాటర్లు విఫలమైన చోట టైటాన్స్ బౌలర్లు కాస్త పోరాడినా.. ఐపీఎల్ అరంగేట్ర బ్యాటర్ కూపర్ కానొలి (44 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 72 నాటౌట్) అజేయ ఆటతీరుతో పంజాబ్‌ను ఆదుకున్నాడు. దీంతో ఈ పోరులో పంజాబ్ 3 వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 162 పరుగులు చేసింది. కెప్టెన్ గిల్ (39), బట్లర్ (38), ఫిలిప్స్ (25) మాత్రమే రాణించారు. వైశాక్‌కు మూడు, చాహల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో పంజాబ్ 19.1 ఓవర్లలో 7 వికెట్లకు 165 పరుగులు చేసి గెలిచింది. ప్రభ్‌సిమ్రన్ (24 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 37) ఆకట్టుకున్నాడు. ప్రసిద్ధ్‌కు మూడు వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా కూపర్ నిలిచాడు.

ఓ మాదిరి ఛేదనలో పంజాబ్ రెండో ఓవర్‌లోనే ఓపెనర్ ప్రియాన్ష్ (7) వికెట్‌ను కోల్పోయింది. అలాగే జట్టు మిడిలార్డర్ కూడా దారుణంగా తడబడడంతో ఓ దశలో పంజాబ్ ఓటమి దిశగా సాగింది. కానీ 22 ఏళ్ల వన్‌డౌన్ బ్యాటర్ కూపర్ మాత్రం చివరికంటా నిలిచి జట్టును ఆదుకున్నాడు. ఆరంభంలో అతడికి మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సహకరించాడు. ఈ జోడీ గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. నాలుగో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ 6,6, కూపర్ 6తో రబాడ 19 రన్స్ సమర్పించుకున్నాడు. తర్వాతి ఓవర్‌లోనూ ఈ జంట 13 రన్స్ రాబట్టడంతో పవర్‌ప్లేలో పంజాబ్ 55/1తో నిలిచింది. స్పిన్నర్లను లక్ష్యం చేసుకుని ఈ ఇద్దరూ బౌండరీలు బాదారు. కానీ పదో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్‌ను రషీద్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 76 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక ఇక్కడి నుంచి పంజాబ్ తడబాటు మొదలైంది. సారథి శ్రేయాస్ అయ్యర్ (18) రెండు వరుస సిక్సర్లతో జోరు చూపించాడు. కానీ కూపర్ ఆడిన షాట్ నేరుగా తన చేతికి తాకడంతో శ్రేయస్ గాయపడ్డాడు. దీంతో చికిత్స తీసుకున్న వెంటనే అతను అవుటయ్యాడు. శ్రేయ్ను?సతో పాటు శశాంక్ సింగ్ (3), స్టొయినిస్ (0)లను పేసర్ ప్రసిద్ధ్ దెబ్బతీశాడు. దీంతో 110/2 నుంచి స్కోరు 118/6కి చేరడంతో పంజాబ్‌పై ఒత్తిడి పెరిగింది. కూపర్ మాత్రం ఓ 4,6తో తన ధాటిని కొనసాగిస్తూ హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. యాన్సెన్ (9) త్వరగానే అవుట్ కాగా.. చివరి రెండు ఓవర్లలో 16 రన్స్ కావాల్సిన వేళ.. 19వ ఓవర్‌లో బార్ట్‌లెట్ (11 నాటౌట్) 6, కూపర్ 4తో 14 రన్స్ వచ్చాయి. దీంతో పంజాబ్ గెలుపు ఖాయమైంది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ ఇన్నింగ్స్‌లో మెరుపులు కరువయ్యాయి. పంజాబ్ బౌలర్లు పొదుపుగా బౌలింగ్ చేస్తూ పరుగులను అడ్డుకున్నారు. టాపార్డర్ క్రీజులో నిలదొక్కుకున్నా ధాటిగా ఆడలేకపోయింది. కనీసం ఒక్క బ్యాటర్ కూడా ఎదురుదాడికి దిగలేదు. దీంతో వీరి ఇన్నింగ్స్‌లో మొత్తంగా మూడు సిక్సర్లే నమోదు కావడం గమనార్హం. రెండో ఓవర్‌లో ఓపెనర్ గిల్ మూడు ఫోర్లతో ఆకట్టుకున్నా ఆ తర్వాత దూకుడు కనిపించలేదు. ఓపెనర్ సాయి సుదర్శన్ (13) నాలుగో ఓవర్‌లోనే వెనుదిరిగాడు. అనంతరం గిల్–బట్లర్ జోడీ దాదాపు ఆరు ఓవర్లపాటు క్రీజులో నిలిచినా రెండో వికెట్‌కు 46 పరుగులే జత చేరాయి. కుదురుకున్నట్టు కనిపించిన గిల్‌ను పదో ఓవర్‌లో చాహల్ అవుట్ చేశాడు. అయితే 12వ ఓవర్‌లో ఫిలిప్స్ 6,4తో.. తర్వాత ఓవర్‌లో బట్లర్ 6తో స్కోరులో కాస్త కదలిక కనిపించింది. కానీ ఈ జోడీ ఒక ఓవర్ వ్యవధిలోనే పెవిలియన్‌కు చేరింది. మూడో వికెట్‌కు వీరు 36 పరుగులు జత చేశారు. డెత్ ఓవర్లలోనూ గుజరాత్ నుంచి జోరు కనిపించలేదు. 19వ ఓవర్‌లో ఆరు పరుగులకే రెండు వికెట్లు కోల్పోగా.. చివరి ఓవర్‌లో అర్ష్‌దీప్ నాలుగు వైడ్లు, ఓ నోబ్ పుణ్యమా అంటూ 12 రన్స్ రావడంతో స్కోరు 160 దాటింది. ఓవరాల్‌గా చివరి ఐదు ఓవర్లలో 34 పరుగులే చేసి మూడు వికెట్లు కోల్పోయింది.

# ఇప్పుడు బానే ఉన్నా.. తన గాయంపై స్పందించిన శ్రేయస్ అయ్యర్!



ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ శుభారంభం చేసింది. న్యూ చండీగఢ్ వేదికగా వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఓపెనర్ కూపర్ కనోలీ ఒంటిరి పోరాటం చేసి జట్టుకు విజయాన్ని అందించాడు. అయితే మ్యాచ్ సందర్భంగా పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గాయపడ్డ విషయం తెలిసిందే. రషీద్ ఖాన్ బౌలింగ్‌లో అయ్యర్ మణికట్టుకు తీవ్ర గాయమైంది. తాజాగా తన గాయంపై శ్రేయస్ కీలక అప్‌డేట్ ఇచ్చాడు.ఏం కష్టమొచ్చిందో..! 'నా చేతికి స్వల్ప గాయమైంది. పెద్దది అవ్వొద్దని గట్టిగా కోరుకున్నా. ప్రస్తుతం అంతా బాగుంది. గాయం తీవ్రత కూడా పెద్దగా లేదు. అయితే ఈ మ్యాచ్‌లో హీరో మాత్రం కూపర్ కనోలీనే. అద్భుతమైన టెక్నిక్‌తో మ్యాచ్ ఆడాడు. కనోలీ బాదిన కొన్ని షాట్స్ మాత్రం అద్భుతం. డ్రెస్సింగ్ రూమ్‌కి వెళ్లి చేతి గాయానికి ఐస్ పెట్టుకునే లోపే టపాటపా వికెట్లు పడిపోయాయి. క్రికెట్‌లో ఇలాంటి పరిస్థితులు సహజం. ఏం జరిగినా పోరాటం ఆపొద్దు. కనోలీ అదే చేశాడు. ప్రశాంతంగా ఆడుతూ జట్టుకు విజయాన్ని అందించాడు' అని అయ్యర్ చెప్పుకొచ్చాడు. 'అర్ష్‌దీప్ సింగ్ వచ్చి బంతి కాస్త ఆగి వస్తోందని చెప్పాడు. అందుకే మేం బంతిని వీలైనంత త్వరగా పాతబడేలా చేయడానికి ప్రయత్నించాం. విజయ్ కుమార్ వైశాఖ్ గత సీజన్ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. అతడు బిగ్ మ్యాచ్ ప్లేయర్. అయితే నేను బ్యాటింగ్ చేసే సమయంలో షార్ట్ లెగ్ ఫీల్డర్‌ను చూసి షాకయ్యాను.





# అనుష్క డార్క్ ఫాంటసీ మూవీ 'కథనార్'




స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి, జయసూర్య హీరోహీరోయిన్‌లుగా నటించిన మలయాళ చిత్రం 'కథనార్' ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. దీనికి 'ది వైల్డ్ సోర్సెరర్' అనే ఉపశీర్షిక పెట్టారు. డార్క్ ఫాంటసీ జాన్రలో తెరకెక్కిన ఈ మూవీ విజువల్ వండర్?లా కనిపిస్తోంది. ట్రైలర్‌లో అనుష్క పాత్ర చాలా గంభీరంగా, మిస్టరీ ఎలిమెంట్స్‌తో ఆకట్టుకునే విధంగా ఉంది. ప్రత్యేకంగా చెప్పాలంటే ఫాంటసీ, హారర్, థ్రిల్లర్ అంశాలను ఇందులో మేళవించారు. విజువల్స్ విషయానికి వస్తే హాలీవుడ్ స్థాయిలో ఉన్నాయి. దీంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు మరింత పెరిగాయి. తెలుగు, తమిళ భాషల్లో అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించిన అనుష్క, కథనార్ మూవీతో మలయాళం ఇండస్ట్రీలోకి అడుగుపెట్టబోతోంది. పురాణాలు, రహస్యాలతో నిండివున్న ఈ టీజర్ విజువల్ వండర్‌లా కనిపిస్తోంది. దీనిని చూసిన అభిమానులు భారీ సెట్టింగ్స్, గ్రాఫిక్స్, సినిమాటోగ్రఫీ అన్నీ బాగున్నాయని ప్రశంసిస్తున్నారు. వాస్తవానికి ఈ సినిమా చిత్రీకరణ 2023 ఏప్రిల్‌లో ప్రారంభమైంది. ఇందుకోసం తమ బృందం మూడేళ్లుగా పనిచేస్తూ వస్తోందని దర్శకుడు రోజిన్ థామస్ గతంలో చెప్పారు. కాగా, దీనిని శ్రీగోకులం మూవీస్ బ్యానర్‌పై గోకులం గోపాలన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో అనుష్క, జయసూర్యతో పాటు ప్రభుదేవ, సనూప్ సన్, వినీత్, శాండీ మాస్టర్, హరిశ్ ఉత్తమన్ తదితరులు నటిస్తున్నారు. మలయాళంలో రూపొందిన ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో అంటే తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లోనూ విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అయిన అనుష్క శెట్టి బాహుబలి 1, 2 చిత్రాల తర్వాత సినిమాల ఎంపికలో చాలా జాగ్రత్తగా ముందుకు వెళ్తున్నారు. అయితే ఘాటీ సినిమాతో ఆమె ప్రేక్షకుల ముందుకు వచ్చినా, అది అనుకున్నంత స్థాయిలో విజయం సాధించలేదు. 'అరుంధతి', 'భాగమతి', 'నిశ్శబ్దం', బాహుబలి వంటి కథల్లో నటించిన అనుష్క ఎప్పుడూ విభిన్నమైన, మహిళా ప్రధానమైన పాత్రలనే ఎక్కువగా ఎంచుకుంటారు. అయితే గతేడాది అనుష్క శెట్టి సోషల్ మీడియాలో ఆసక్తికర పోస్ట్ పెట్టారు. తాను కొంత కాలం బ్రేక్ తీసుకుంటానని అందులో పేర్కొన్నారు. అమె పెట్టిన పోస్టులో "నీలి వెలుగును దీపకాంతిగా మార్చుకుంటూ సరైన జీవితాన్ని గుర్తు చేసుకునేందుకు, ప్రపంచంతో మళ్లీ కలిసిందుకు కొంతకాలం సోషల్ మీడియా నుంచి దూరంగా ఉండబోతున్నాను. కానీ, త్వరలోనే మరిన్ని కథలతో, మరింత ప్రేమతో మీ ముందుకు వస్తాను. ఎప్పుడూ చిరునవ్వుతో ఉండండి. ప్రేమతో మీ అనుష్క శెట్టి " అంటూ రాసింది. దీనికి ప్రధాన కారణం, ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఘాటీ ప్రేక్షకులకు ముందుకు వచ్చి నిరాశపరిచడమే. వాస్తవానికి, బాహుబలి సినిమా పదేళ్లు పూర్తి చేసుకుందన్న సందర్భంగా మూవీ టీమ్ అందరు కలిసి సెలబ్రేట్ చేసుకున్నారు. అందులో సినిమాకు సంబంధించిన తారాగణంతో పాటు, సినిమా డైరెక్టర్ కూడా పాల్గొన్నారు.

# 'రాకాస' ఆకట్టుకుంటుంది : నిహారిక



'సరికొత్త పంథాలో..మంచికథలతో ముందుకెళు న్నాం. మా సినిమా 'రాకాస' అన్ని తరగతుల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకంతో ఉన్నాం. ఎవరో పొగిడారనో..ఇంకొకరు ఇంకేదో అన్నారనో..అనేది మనసులో ఉండదు. మా కంటూ ఒక లక్ష్యం ఉంది. ప్రణాళికలు ఉన్నాయి. వాటిని నిజం చేసుకోవటానికి ముందుకెళ్తున్నాం. ఆచరణలో ఇబ్బందులు, కష్టాలు ఉండొచ్చు. అయినా ముందుకెళ్లాలనే లక్ష్యంతోనే అడుగులు వేస్తున్నాం. ఇలాంటి సినిమాలెందుకు తీస్తున్నారని కొంతమంది ప్రశ్నించారు. చాలామంది సలహాలు ఇచ్చారు. ఏ దైనా 'రాకాస' సినిమా వీఎఫ్ఎక్స్ విషయంలో పెద్ద సినిమాల మాదిరిగానే కష్టపడాల్సి వస్తుంది. చిన్న బడ్జెట్ సినిమాకు అంత ఎఫెక్ట్ అవసరమా?. ఇబ్బంది పడతారు.. చూసుకోండి అని కూడా కొందరు చెప్పారు. ఏమి చేసినా మాటలు అనే వాళ్లు అంటూనే ఉన్నారు. అందుకే నేను చేయాలనుకున్నది చేస్తూనే ఉంటా. ఓ మంచి సినిమా తీశాం. జనాల్లోకి తీసుకెళ్లడానికి బాగా ప్రమోట్ చేస్తున్నాం. ఇంటింటికీ వెళ్లి సినిమా చూపించడానికి కూడా రెడీగా ఉన్నాం. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో భాగమైన ప్రతి ఒక్కరికీ సొంతిల్లు, కారు ఉండాలని ఆశిస్తున్నాం. కమిటీ కుర్రోళ్లు మూవీతో 11 మంది కొత్త వాళ్లను పరిచయం చేశా' అని నిర్మాత నిహారిక కొణిదెల అన్నారు. కమిటీ కుర్రోళ్లు మూవీ తర్వాత నిర్మాతగా మారిన ఆమె ప్రస్తుతం తన సొంతం బ్యానర్ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌పై రాకాస అనే మూవీని నిర్మించారు. సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. మానస శర్మ దర్శకత్వం వహించారు. ఈనెల మూడోతేదీన ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ప్రచార కార్యక్రమంలో భాగంగా నిహారిక పై విధంగా మాట్లాడారు.

# 3న విడుదల కానున్న 'బైకర్'




టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్ నటిస్తున్న కొత్త చిత్రం 'బైకర్' ప్రమోషన్స్‌లో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పాలుపంచుకున్నారు. ఏప్రిల్ 3న విడుదల కానున్న ఈ సినిమాకు మద్దతుగా ప్రభాస్ తన నివాసంలో ఓ కొత్త బైక్‌పై రైడ్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "ట్రైలర్ చూసి కొన్ని కొన్ని నమ్మేయాలి డూడ్.. లెట్స్ రేస్" అంటూ శర్వా అభిమానులను, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. శర్వానంద్ తనకు అత్యంత ఆప్తుడని ప్రభాస్ ఈ సందర్భంగా తెలిపారు. "శర్వానంద్ మా ఇంటి హీరో. నిర్మాతలు ప్రమోద్, వంశీ నా ఫ్యామిలీ, నా ఫ్రెండ్స్" అని ఆయన పేర్కొన్నారు. సొంత నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మించిన ఈ చిత్రానికి ప్రభాస్ స్వయంగా ప్రచారం కల్పించడం విశేషం. ఈ వీడియోను యూవీ క్రియేషన్స్ తమ సోషల్ మీడియా ఖాతాలో పంచుకుంది. "పండగలా దిగివచ్చాడు. ఈ మద్దతు మాకు ఎంతో విలువైంది" అంటూ ప్రభాస్‌కు కృతజ్ఞతలు తెలిపింది. తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో ఏప్రిల్ 3న 'బైకర్' చిత్రం విడుదల కానుందని వెల్లడించింది. ప్రభాస్ ప్రమోషన్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.






Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**